"బ్రహ్మమొక్కటే" గ్రంథమాల

# భక్త కనకదాసు

రచన
ఆచార్య జి. ఎస్. మోహన్

ముఖ్య సంపాదకులు
ఆచార్య రవ్వా శ్రీహరి

ప్రచురణ :
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2013

**BHAKTHA KANAKADASU**

**by**
**Prof. G.S.MOHAN**
1256, 7th cross, IV Main
Chandra Layout
BANGALORE. 560040

Editor - in - Chief
**Prof. RAVVA SRIHARI**

T.T.D. Religious Publications Series No. 1008
© All Rights Reserved.
First Edition : 2013

Copies :

Price:

*Published by :*
**L.V. Subrahmanyam** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams
Tirupati.

Art :

DTP : Editor-in-chief office,
TTD, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.517507

# ముందుమాట


భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం జి.యస్.మోహన్‌గారు రచించిన **"భక్త కనకదాసు"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.



# కన్నడ హరిదాస సాహిత్యం - పరిచయం

పన్నెండో శతాబ్దంలోని శివశరణుల పదాలే కన్నడంలో ప్రప్రథమకీర్తనలన్న అభిప్రాయం ఉంది. వివిధరంగాల్లో పాడడానికి అనుకూలమయిన వచనసాహిత్యం కన్నడ హరిదాస సాహిత్యానికి స్ఫూర్తినిచ్చింది. కన్నడ హరిదాస కీర్తన పరంపరలో నరహరి తీర్థులవారిని (13-14 శతాబ్దం) ఆద్యులుగా పేర్కొంటారు దాససాహిత్యంలో ప్రధాన లక్షణాలయిన పశ్చాత్తాపం, శరణాగతి, వైరాగ్యభావాలు ఈయన కీర్తనల్లో అభివ్యక్తమయ్యాయి.

సంగీత సాహిత్యాలు రెండింటినీ ఆస్వాదించిన సంకీర్తన కవులు కన్నడ హరిదాసకవులు. బ్రహ్మానందమైన అనుభవానికి రసరాగలయబద్ధమైన నాదోపాసనకోసం వాగ్గేయకారులు కనిపెట్టిన పరమోత్తమ సాధనాలలో 'కీర్తన' ఒకటి. కీర్తన అంటే స్తుతి, వర్ణన అని అర్థం. నవవిధ భక్తుల్లో కీర్తన ఒకటి. భగవంతుని కీర్తిస్తూ చేసే గానమే కీర్తనభక్తి. అందువల్లనే కన్నడంలో కీర్తనను 'దేవరనామ' అని కూడ అంటారు. కీర్తనల్లో పల్లవి, అనుపల్లవి, పదం(నుడి) అనే త్రిధాతువులు ఉంటాయి.

వాగ్గేయ కారుడంటే వాక్యాన్ని గేయరూపంలో పెట్టేవాడని అర్థం. పాటలోని వాక్కులకు 'మాతువు' అనిపేరు. సంగీతానికి సంబంధించిన గేయానికి 'ధాతువు' అనిపేరు. వాగ్గేయకారుడికి ఉండాల్సింది వాక్‌శక్తి మరియు గేయనిర్మాణ చాతుర్యం.

కీర్తనల్లో నామముద్ర ఉండడం లక్షణంగా కన్పిస్తుంది. అంకితనామాన్ని గురువునుండి స్వీకరించే విశిష్ట సంప్రదాయం హరిదాసుల్లో ఉంది. కన్నడ హరిదాసుల్లో ఈ లక్షణాలన్నీ కన్పిస్తాయి.

భారతదేశంలోని త్రిమతాచార్యులలో ద్వైతసిద్ధాంత బోధకులు శ్రీమన్మధ్వాచార్యులవారు. వారి శిష్యపరంపరే కర్నాటక హరిదాస పరంపర. మధ్వాచార్యులవారి ప్రత్యక్షశిష్యులలో నరహరితీర్థులు, పద్మనాభతీర్థులు, మాధవతీర్థులు, అక్షోభ్యతీర్థులు ముఖ్యులు వీరిలో పద్మనాభతీర్థుల తరంలో ఎనిమిదవ మఠాధిపతులు శ్రీపాదరాజులవారు. వీరు తమగురువులైన స్వర్ణవర్ణ తీర్థులచే తమిళనాడులోని శ్రీరంగంలో పీఠం అధిరోహించారు. పిదప కర్నాటకలోని కోలారుజిల్లా ముళబాగిలును ద్వైతసిద్ధాంత కేంద్రంగా చేసుకొన్నారు. మాధ్వమతమఠం పరిసరాల్లో సంస్కృతభాషా ప్రభావం అధికంగా ఉండేది. పొరుగు ప్రాంతమయిన తమిళనాడులోని ఆళ్వారులు తమిళంలోనే పాశురాలను రచించి పాడడం, అంతకుముందే శివశరణులు కన్నడంలోనే భక్తితత్త్వాలను పాడడం, అవి ప్రజలమీద ఎలాంటి ప్రభావం చూపాయో గమనించిన శ్రీ పాదరాజులవారు తాము కూడ తమపూజాసమయంలో చిన్నచిన్న స్తుతిగీతాలను కన్నడంలోనే రచించి పాడడం మొదలుపెట్టారు. అవే కన్నడ హరిదాస సాహిత్యం మొట్టమొదటి కీర్తనలుగా ప్రస్తుతి కెక్కాయి. వీరితర్వాత వీరి శిష్యులు వాదిరాజ, పురందర, కనకదాసులు విజయ నగర పరిసరాల్లో కీర్తన సంప్రదాయాన్ని పోషించారు ఆ పిదపకూడ విజయనగర పతనానంతరం కాఖండకిలోని మహీపతిరాయలు, ఆయన తమ్ముడు విజయదాసులు హరిదాససాహిత్య పరంపరను కొనసాగించారు. ఇలా నాటి నుండి నేటిదాకా శిష్యులు, ప్రశిష్యులు వేలాది సంఖ్యల్లో కీర్తనలను రచించి మానవాళికి అందించారు; హరిదాస సాహిత్యాన్ని పునరుజ్జీవింపజేశారు. మానవ జీవనతత్త్వాన్ని సమాజానికి అందించి మార్గదర్శకు లయ్యారు[1].

1. హరిదాస వాఙ్మయ(క)పీఠక, డా॥ టి.ఎన్. నాగరత్న



సాధారణంగా హరిదాసులందరూ మాధ్వమత తత్త్వాలను అంగీకరించినవారే. హరి సర్వోత్తముడు, వాయుజీవోత్తముడు, జగత్తుసత్యం, జీవుడు – ఈశుడు – జడపదార్థం – వీటికిగల భేదం, ఈశుడు–జీవుడు– ఈ రెండింటికిగల బింబ ప్రతిబింబ స్వరూపం మొదలైన తత్త్వాలలో విశ్వాసం ఉన్నవారు హరిదాసులు మాధ్వమతాధిపతులైన శ్రీపాద, వ్యాసరాయ, వాదిరాజులవారు ఈ విశ్వాసాన్ని తమ కీర్తనలద్వారా ప్రతిపాదించారు.

శ్రీపాదరాయలు (14–22–1480) హరిదాస సాహిత్యస్వర్ణయుగానికి నాందిగీతం పాడారు. 'దేవరనామా'లని పూజాసందర్భాల్లో పాడే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. వందలాది కీర్తనలను, సుళాది, ఉగాభోగాలను రచించి, వాటి ద్వారా ముక్తిని పొందడానికి అపేక్షించారు. భక్తి సాధన వారి అపేక్ష అయితే, మాధ్వమతతత్త్వాల ప్రచారం వారి ఉద్దేశంకూడా అయింది.

సాళువ నరసింహరాయని బ్రహ్మహత్యాదోషంనుండి ముక్తుని గావించినవారు శ్రీపాదరాయలవారు. తమ శంఖోదకంతో ఆ దోషాన్ని శుద్ధిచేశారు.

హరిదాస సాహిత్యానికి స్థిరరూపం తెచ్చినవారు శ్రీపాదరాయలవారి శిష్యులయిన వ్యాసరాయలవారు (1446–1539). శ్రీపాదరాయల నుండి మాధ్వశాస్త్ర సారాన్ని గ్రహించి సాహిత్యానికి దాన్ని ఉపయోగించారు. శ్రీకృష్ణ అన్నమకుటంతో పలుకీర్తనలు రచించారు. వీరికాలంలో 'వ్యాసకూట' 'దాసకూట'ములు కన్నడనాడులోని ధార్మిక, సాహిత్యక్షేత్రాలకు ఎనలేని సేవచేశాయి.

తిరుమల శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళమూర్తిని నిత్యం సుప్రభాతంతో ప్రారంభించి పవ్వళింపుసేవలవరకు అన్నింటినీ నిర్వర్తిస్తూ అర్చకత్వ బాధ్యత

చేపట్టిన ఏకైక కన్నడ వాగ్గేయకారులు శ్రీవ్యాసరాయలు. ఆయన తంత్రసారోక్త ఆగమానుసారం స్వామివారికి కైంకర్యాదులను నిర్వహించారు. తిరుమలలో 12 సంవత్సరాలపాటు (క్రీ. శ. 1486 – 1498 వరకు) అర్చకత్వాన్ని చేపట్టారు దీనికి ప్రధానకారణం వీరిగురువులైన శ్రీపాదరాయలవారికి ఆనాటి తిరుపతి పాలకుడైన సాళువ నరసింహరాయలకున్న సంబంధబాంధవ్యాలు. శ్రీవ్యాసరాయలవారు వాగ్గేయకారుడిగానేకాక మఠాధిపతిగా కూడ ఖ్యాతికెక్కారు. పుష్కరిణికి ఉత్తరంవైపు కట్టించిన శ్రీవ్యాసరాయమఠం ఇప్పటికీ ఉంది.

శ్రీకృష్ణదేవరాయలకు ఏర్పడిన 'కుహు యోగమ'నే గండంనుంచి తప్పించిన మహానుభావులుగా శ్రీవ్యాసరాయలవారిని పేర్కొంటారు. దానికి ప్రతిఫలంగా రాయలవారు వీరిని సింహాసనాధిష్ఠితులను చేశారని, పిమ్మట వ్యాససముద్రం అనే గ్రామాన్ని దానంచేశారని శ్రీపురందరదాసులు పేర్కొన్నారు.

**'నిగమాగమ నిర్ణీత నిర్జరాధీశ మంత్రిణే ।**
**నృపేంద్రమకుటీరత్న విరాజిత నిజాంఘ్రయే ।**
**నిరహంకార చిత్తాయ నీతి మార్గోపదేశినే ।**
**శేషాయ నరవేషాయ శిక్షితాంతరవైరిణే ।**
**పురాణపురుష ధ్యాన పుష్యత్పులక మూర్తయే ।**
**మధ్వాచార్య మతాంభోజ మార్తాండాయిత తేజసే ।**
**బ్రహ్మణ్య తీర్థ శిష్యాయ బ్రహ్మ నిర్మల మూర్తయే ।**
**వ్యాసతీర్థ యతీంద్రాయ విద్వ దిందీవరేందనే ।'**

అని వ్యాసరాయలవారు శ్రీకృష్ణదేవరాయలచే సేవింపబడ్డ మహిమాన్వితులుగా క్రీ.శ. 1527కు చెందిన ఒకశాసనం తెలుపుతుంది.



వ్యాసరాయలవారి శిష్యులుగా, సహధ్యాయులుగా, ప్రముఖ వాగ్గేయకారులుగా ప్రసిద్ధులు శ్రీవాదిరాజులు, శ్రీపురందరదాసులు, శ్రీకనకదాసులు ఈ ముగ్గురూ శ్రీవ్యాసరాయల వారి వద్దనే విద్యాభ్యాసం చేశారు.

పురందరదాసు దాససాహిత్యానికి అత్యున్నత స్థానాన్ని కల్పించారు. వ్యాసరాయలవారినుండి మధ్వమత దీక్షను పొంది 'పురందరవిఠల' అన్న అంకితనామాన్ని స్వీకరించారు.

శ్రీపాదరాయలు (క్రీ.శ 1404– 1502) అన్నమాచార్యులవారికి (1408–1503) సమకాలికులు. శ్రీవ్యాసరాయల వారు (క్రీ.శ. 1447–1539) పెదతిరుమలాచార్యులవారికి (1458–1562) సమకాలికులు. వాదిరాజులు (1480–1600), పురందరదాసులు (1480–1504) కనకదాసులు (1508–1607) – ఈ ముగ్గురూ చినతిరుమలాచార్యులవారికి (1488–1562) సమకాలికులు. శ్రీపాదరాయలవారి కాలంనుంచీ ఆంధ్ర, కర్నాటక రాజ్యాలలో వాగ్గేయకారులమధ్య సమకాలీన సంబంధం ఉంది. శ్రీపాదరాయలు, అన్నమాచార్యుల ఒకే కాలంలో జీవించినట్లుగా వాళ్ళ జీవిత కాలాలనుబట్టి తెలుస్తున్నా, వాళ్ళిద్దరూ కలుసుకొన్నట్టుగా ఆధారాలు లేవు. అయితే తాళ్ళపాక చిన్నన్న రచించిన అన్నమయ్య జీవిత చరిత్రనుబట్టి అన్నమాచార్య, పురందరదాసులు ఒకర్నొకరు కలుసుకొన్నట్టు తెలుస్తుంది.

కన్నడ సాహిత్యచరిత్రలో కనకదాసులవారికి విశిష్టస్థానం ఉంది. వ్యాసరాయలనుండి దాసదీక్షను స్వీకరించిన తర్వాత దాస సంప్రదాయం ప్రకారం ఈయనకూడ అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించారు. పురందరదాసు, కనకదాసుల లాగానే వ్యాసరాయలవారి శిష్యులూ, మఠాధీశులూ అయి దాససాహిత్యానికి సేవచేసినవాళ్ళలో వాదిరాజుల (1480–1600) వారిని పేర్కొనాలి.

వ్యాసరాయలవారి కాలంలో దాససాహిత్యానికి సంబంధించిన విశిష్టకృతులు వెలువడ్డాయి. ఈ కాలాన్ని దాససాహిత్యపు 'స్వర్ణయుగం' అంటారు. విజయనగర సామ్రాజ్యపతనంతో దాససాహిత్యం కళావిహీనమైంది. పురందరదాసుల కాలానికీ, విజయదాసుల కాలానికీ మధ్య కీర్తన సాహిత్యపుసేతువులాగ ఉన్నవారు మహీపతిరాయలు. ఈయనను కొంతమంది దాససాహిత్యపరంపరలో చేర్చుకోకపోయినా ఈయన రచించిన దేవరనామాలు వైశిష్ట్యంతో కూడుకొని ఉన్నాయి.

దాససాహిత్యాన్ని పునరుజ్జీవింప జేసిన ఘనత విజయదాసులకు (1687-1755). దక్కుతుంది. విజయవిఠల అన్న అంకితనామంతో ఈయనకృతుల్ని రచించారు. విజయదాసుల శిష్యపరంపరలో గోపాలదాసు (1728-65) ముఖ్యులు. 'గోపాలవిఠల' అన్న మకుటంతో అనేక కీర్తనల్ని రచించారు. ఈ కాలంలోని హరిదాసశ్రేణిలో జగన్నాథదాసులు పేర్కొనదగ్గవారు. పురందరదాసు, విజయదాసు, గోపాలదాసు, జగన్నాథదాసులను 'దాసచతుష్టయం' అని పిలుస్తారు. మోహనదాసులు, ప్రసన్న వేంకటదాసులు ఈ కాలంలోనే ప్రసిద్ధులైన హరిదాసులు.

హరిదాస సాహిత్యపరంపరలో స్త్రీలపాత్రకూడ శ్లాఘించదగ్గది. గలగలియ అవ్వ 'రామేశ' అన్న ముద్రికతో కృతుల్ని రచించారు. అలాగే హెళవనకట్టె గిరియమ్మ 'హెళవనకట్టెరంగ' అన్న అంకితనామంతో ప్రసిద్ధిచెందింది. హరపనహళ్ళి భీమవ్వ 'భీమేశకృష్ణ' అన్న ముద్రికతో అనేక కీర్తనలు రచించింది. ఇలా కన్నడ హరిదాస సాహిత్యం కన్నడ సాహిత్య చరిత్రలో ఒక విశిష్టస్థానం పొందింది.

# భక్త కనకదాసు జీవితరేఖలు

కన్నడ సాహిత్యంలో 'దాససాహిత్యం' వైశిష్ట్యంతోనూ, వైవిధ్యంతోనూ కూడుకొన్నది. దాససంప్రదాయంలో పురందరదాసులకు, కనకదాసులకు అగ్రస్థానం ఉంది. పురందరదాసు ఎలా కోటీశ్వరుడుగా ఉండి, అహంకారంతో మెలగి చివరికి 'దాసులంటే పురందర దాసులయ్యా' అని వ్యాసరాయలవారిచే ప్రశంసింపబడి 'హరిదాసపంథ'కు అమూల్య రత్నమయ్యారో, అలాగే కనకదాసుకూడ దండనాయకుడి పుత్రుడుగా జన్మించి అధికారాన్ని చవిచూసి చివరికి దైవప్రేరణవల్ల అన్నింటినీ త్యజించి తంబురాపట్టుకొని కాగినెలె ఆదికేశవుని మహిమను కొనియాడుతూ, వీధుల్లో తిరుగుతూ భక్తిరసామృతాన్ని అందరికీ పంచిపెట్టిన మహనీయునిగా కొనియాడబడుతున్నారు.

కనకదాసు ఎంతటి శ్రేష్ఠ భగవద్భక్తుల్లో అంతటి భవరోగవైద్యులుకూడా. కనకదాసువంటి దాసశ్రేష్ఠులు మరొకరు లేరనడం అతిశయోక్తికాదు. ఆయన కీర్తనకారులేకాదు, అపూర్వమైన నాలుగు కావ్యాలను రచించిన అద్భుతకవులు, అనేక 'దేవరనామా'లను, 'ముండిగె'లను రచించిన ప్రతిభాసంపన్నులు. దండనాయకుని కుమారుడుగా రాజవైభవ పరిసరాల్లో జనించినా, భక్తిభావసంస్కారంతోపాటు శాస్త్రపురాణాల శిక్షణను, శస్త్రాస్త్రవిద్యను, పాలన వ్యవహార పాఠాలను నేర్చిన సమర్థుడైన పాళెగాడు గా మనకు దర్శనమిస్తాడు.

కనకదాసు పురందరదాసువలే యతీకాదు, మఠాధిపతీ కాదు. సంసారి. సంసారం గావిస్తూనే దాసదీక్షను స్వీకరించి కన్నడభాషలో మాధ్వమతాన్ని ప్రచారం చేసిన దాసశ్రేష్ఠుడు; హరిదాస సంప్రదాయాన్ని కొనసాగించిన విద్వద్వరేణ్యుడు కనకదాసు. క్రీ.శ. పదిహేడో శతాబ్దంలో కాఖండకిలోని మహిపతిరాయల కుమారుడైన కృష్ణరాయలు తమ ఒక కీర్తనలో హరిదాస పరంపరను పేర్కొని, వాళ్ళందరికీ నమస్కరిస్తూ 'తాళ్ళపాకవారి సాధుభక్తి,

కనకదాసుల హరిభక్తి ఉల్లాసకరము' అని స్మరించి నమస్కరిస్తున్నట్టుగా గానం చేశారు. ఇక్కడ తాళ్ళపాక అన్నమాచార్యులవారితో పాటు కనకదాసుల వారిని కూడ స్మరించడం గమనించదగ్గవిషయం[2].

పురందరదాసుల సమవయస్కులు, సమకాలీనులు కనకదాసు. ఇద్దరూ వ్యాసరాయలవారి శిష్యులు ; పండిత పామరులకు చిరపరిచితులు. ఇద్దరి జీవితాలలోనూ పరమాత్ముడే పరీక్షకుడుగా వచ్చి, ఇద్దరినీ పలువిధాలుగా పరీక్షించి వైరాగ్యాన్ని ప్రసాదించిన కథలున్నాయి. పురందరదాసులాగానే కనకదాసులవారి కావ్యాలు సౌరభానికి, కీర్తనలలోని గూఢార్థాలకు, భావతీవ్రతలకు సామాజిక స్పృహకు పండితులు అచ్చెరువందారు. సాధారణ జనులు ఆ కీర్తనలను పాడి మైమరచిపోయారు.

కనకదాసులవారి జీవితచరిత్ర అత్యంత కుతూహలాజనకంగా కన్పిస్తుంది. కనకదాసు జాతిరీత్యా కురుబకులస్థులు. క్రీ.శ. 1508లో ధారవాడ జిల్లాలోని బంకాపురం సమీపంలోని 'బాడ' అనే గ్రామంలో జన్మించారు. తండ్రిపేరు బీరప్ప, తల్లిపేరు బచ్చమ్మ ఈయనకు మొదట్లో 'తిమ్మప్ప' అనే పేరుండేది. ఈయన తండ్రి దండనాయకుడు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకొన్న తిమ్మప్పను తల్లి ప్రీతితో పెంచి, పెద్ద చేసింది. కుస్తీ, గరడీసాధన, కత్తివరస, వేటాడడంలో తిమ్మప్ప ఆసక్తితో పాల్గొనేవాడు. కొంతకాలానికి బాడప్రాంతపు దండనాయకుడై తిమ్మప్ప నాయకుడయ్యాడు. రైతులనుండి ధాన్యరూపంలో సుంకం వసూలుచేసి, దానిని అమ్మి, ధనాన్ని విజయనగర భండాగారానికి ఇచ్చేవాడు. యుద్ధ సమయంలో విజయనగర రాజుకు సహాయకుడిగా ఉండి వీరావేశంతో పోరాడేవాడు. రాజుగారి అభిమానానికి పాత్రుడై దక్షుడైన అధికారిగా పేరుగాంచాడు.

2. కనకదాస (కన్నడం), పుట. 13, టి. ఎస్. నాగరత్న



ఒకసారి తిమ్మప్పనాయకుడు భూమిని దున్నుతుండగా సువర్ణనిధి లభించింది. ఆ నిధితో తన గ్రామసమీపంలోని 'కాగినెలె'లో ఒక అందమైన దేవాలయాన్ని కట్టించాడు. తన గ్రామంలోని ఆదికేశవమూర్తిని కాగినెలె దేవాలయంలో ప్రతిష్ఠించాడు. బీదసాదలకు ధనకనకాలను దానం చేస్తుండడం వల్లనూ, భూమిలో ధనరశి దొరకడంవల్లనూ ప్రజలు అతనిని 'కనకనాయకుడని' పిలవడం ఆరంభించారు.

తిరుపతి మొదలైన క్షేత్రాలలో జరిగే పూజాపద్ధతుల్ని కాగినెలెలోకూడ ప్రవేశపెట్టాడు కనకనాయకుడు. క్రమంగా ఆ చుట్టుప్రక్కల ప్రజలు తిరుపతి మొక్కుబడులను కాగినెలె ఆదికేశవునకు సమర్పించడం మొదలుపెట్టారు. కనక నాయకుని వ్యక్తిత్వం, దర్పం, ఆలయ ఉత్సవాల నిర్వహణ మొదలైన వాటి ప్రభావంవల్ల కాగి నెలె 'ఉత్తరకర్నాటక తిరుపతి అయింది. కనకనాయకునకు తిరుపతి తిమ్మప్పయే అనుగ్రహించి కాగినెలెలో నెలకొన్నాడనీ, తిరుపతి క్షేత్రానికి సమర్పించే కానుకలను ఆదికేశవునకు సమర్పిస్తే తిమ్మప్పకే (తిరుమలప్ప) చెందుతాయనీ ప్రజలలో నమ్మకం కలిగింది.

కనకనాయకుడు కాగినెలెలో దేవాలయాన్ని కట్టించినప్పటినుంచీ ఆదికేశవునిమీద కీర్తనలు వ్రాసి అంకితం చేసేవాడు. అయినా అతనికి ప్రజల్ని పాలించాలన్న అధికార వ్యామోహం అధికంగా ఉండేది. ఆదికేశవుడు కనకని కలలోకన్పించి, తన దాసుడవై, నిరంతరం పూజించుమని ఆదేశమిచ్చాడు. దొరలాగ ప్రజల్ని పాలించాలని, దాసుడై తిరిపెమెత్తడానికి సిద్ధంగాలేనని ఆదికేశవునకు విన్నవించాడు కనకనాయకుడు.

ఒకమారు విజయనగరపురాజు యుద్ధానికి బయల్దేరాడు. అతనితోపాటు కనకనాయకుడు కూడ యుద్ధరంగాన్ని ప్రవేశించాడు. వీరావేశంతో పోరాడాడు. శత్రుసైనికుని బాణం చేతికి తాకింది. అతనిచేతిలోని

ఖడ్గం క్రిందపడింది. 'ఆదికేశవా' అంటూ నేల కొరిగాడు. స్పృహతప్పి పడిపోయాడు. కనకనాయకుడు మరణించాడని శత్రువులు అతనిని అక్కడే వదలి వెళ్ళిపోయారు. అప్పుడు ఆదికేశవుడు మానవరూపంలోవచ్చి అతనికి శైత్యోపచారాలను చేశాడు. కళ్ళుతెరచి కనకనాయకుడు నీ వెవ్వరని ప్రశ్నించాడు. అందులకావ్యక్తి 'ఆదికేశవా!' అని పిలిచినందులకు నేను వచ్చాను. దాసుడవై నన్ను పూజింపు మంటే నీవు వినలేదు. దొరతనము చేస్తానన్నావు. శవాలమీద ఇలా బాధపడుతూ పడియున్నావుకదా? దొరతన మింకనూ చాలలేదా? ఇప్పుడైనా దాసుడ వగుటకు సమ్మతింతువా? అని అడిగాడు. కనకడు 'తన దేహంమీదున్న గాయాల బాధచే ఏమీ ఆలోచించడానికి సాధ్యం కావడం లేదన్నాడు. ఆదికేశవుడు తన అమృతహస్తంతో కనకడి దేహం నిమిరాడు. కేశవుని కృపవల్ల అతని శరీరంపైనున్న గాయాలు మాయమయ్యాయి. ఆనందంతో గంతులువేస్తూ దాసుడవడానికి అంగీకరించాడు. లీలా మానుషరూపియైన భగవంతుని నిజరూపాన్ని చూపించుమని ప్రార్థించాడు. ఆదికేశవుడు శంఖచక్ర గధాపద్మాలను తన నాలుగు హస్తాలలో ధరించి, పీతాంబరధారియై అతని ఎదుట ప్రత్యక్ష మయ్యాడు. ఆ దివ్య సుందరమూర్తికి సాష్టాంగ నమస్కారం చేసి, అనేక విధాలుగా స్తుతించారు. దేశాధిపతి అనే దురహంకారం తననుండి దూరమైందనీ, తనను హరిదాసుల దాసునిగా చేయుమని వినయంతో ప్రార్థించాడు. కనకని స్తుతిచే సంతృప్తి చెందిన ఆదికేశవుడు అతడు స్మరించినప్పుడెల్లా దర్శన మిస్తానని వరమిచ్చి అదృశ్యమయ్యాడు[3]. ఈ విషయాన్నంతటిని కనకదాసులవారే తమ ఒక కీర్తనలో తెలియజేశారు.

3. శ్రీ శ్రీనివాసనహాడుగళు, సం. 2, 1982, తిరుమల తిరుపతి దేవస్థానముల. ప్రచురణ.



**'హరి నిన్న పరమార్థ నిరుతదిందలి ఎనగె**
**దొరెయితీ గురుపాదహరియే ॥ప॥**
**గురుమంత్రమూల సద్గురుమూర్తినీనాగి**
**కరెయ సేరిసిదెన్న హరియె ॥ ॥అ.ప॥**
**దొరెతనవ బిడిసి సుస్థిరమార్గ తోరిసిదె**
**.......................................**
**.......................................**
**.......................................'**

సద్గురుమూర్తివై దొరతనము విడిపించి సుస్థిరమార్గంచూపావని హరిని కొనియాడాడు.

రణరంగంనుండి వెనుదిరిగాడు కనకనాయకుడు.

కొంతకాలానికి పత్నివియోగమైంది. రాజ్యకార్యంలో ఆసక్తి సన్నగిల్లింది. వేటాడడాన్ని కూడ వదలిపెట్టాడు. మనస్సును అదుపుల్లో ఉంచుకోవడానికి ప్రయత్నించాడు. ఈలోగా తాను భక్తితో సేవించే తల్లికూడ కన్నుమూసింది. అప్పటినుండి అతనిలో వైరాగ్య భావం అంకురించింది. అధికారాన్ని మరొకరికి అప్పజెప్పి, తన దగ్గరున్న ధనకనకాలను దానంచేసి 'ఏకతార'ను చేపట్టి కాగినెలెకు వెళ్ళాడు. తనను ఉద్ధరింపుమని ఆదికేశవుని ప్రార్థిస్తూ దేవాలయంలో నిద్రించాడు. కలలో స్వామి కన్పించి వ్యాసరాయ స్వాములవారి శిష్యుడవు కమ్మని ఆదేశించారు. వెంటనే కనకడు వ్యాసరాయలను వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ సమయంలో వ్యాసరాయలు మదనపల్లిలో వ్యాససముద్రాన్ని కట్టిస్తున్నారు. అక్కడికి వెళ్ళి గురువులకు నమస్కరించి, తనకు మంత్రోపదేశం చేయవలసిందిగా కోరాడు. వ్యాసరాయలు నవ్వుతూ "కురుబ కులస్థునికి ఎలాంటి

మంత్రమయ్యా, 'కోణమంత్రం' '(దున్నపోతుమంత్రం) అన్నారు. కనకడు తనకు పరమానుగ్రహమైందని తెలిపి సమీపంలో ఉన్న వృక్షం క్రింద కూర్చొని భక్తితో 'కోణ, కోణ' (దున్నపోతు, దున్నపోతు) అని జపించడం మొదలుపెట్టాడు. అతని దృఢ భక్తికి మెచ్చి యమధర్మరాజు వాహనమైన దున్నపోతు అతని ముందు ప్రత్యక్షమైంది. దాన్ని గురువుల చెంతకు తోలుకొని వెళ్ళి కనకడు 'గురువర్యా ! తా ముపదేశించిన మంత్రం నాకు సిద్ధించింది. దున్నపోతు ప్రత్యక్షమైంది. తరువాతి కార్యాన్ని సెలవియ్యండి' అని వినయంతో విన్నవించాడు. వ్యాసరాయలవారు పరమానందం చెంది, తాము నిర్మిస్తున్న వ్యాససముద్రపు ఒక చివర్లో గుట్టలాగ పడిఉన్న పెద్దబండరాయిని దున్నపోతుతో ముక్కలు చేయించమని చెప్పారు. అది క్షణాల్లో తన కొమ్ములతో చీల్చి బెజ్జం ఏర్పడేటట్టు చేసింది. ఆ బెజ్జంద్వారా నీరు ప్రవహింపజేసి చుట్టుప్రక్కల భూముల్ని వ్యవసాయం చేయడానికి అనుకూలంగావించారు. నేటికీ ఆ స్థలంలో 'కనకుడి బెజ్జం' అని ప్రసిద్ధమైన బెజ్జాన్ని చూడవచ్చు. సంతృప్తి చెందిన వ్యాసరాయలు కనకుని శిష్యునిగా స్వీకరించి ఉపదేశం చేశారు[4] నాటినుండి కనకడు కనకదాసయ్యాడు ; వ్యాసరాయలవారి ప్రియశిష్యుడయ్యాడు.

వ్యాసరాయలవారిని కలిసినప్పట్నుండీ మఠంలోని భక్తుల్లో, ఇతర శిష్యుల్లో ఈర్ష్యాసూయలు పెరిగాయి. ఉభయులూ కలిసి ఉండడాన్ని సహించలేకపోయారు. కన్నడంలో 'దేవరనామా'లను పాడడం ప్రజల్లో అసంతృప్తిని కల్గించింది అంతేకాకుండా వ్యాసరాయలవారి ఇతర శిష్యులు కనకదాసుని తక్కువ కులంవాడని హీనంగా చూడడం మొదలుపెట్టారు. కనకదాసుమీద వ్యాసరాయలు చూపుతున్న ఆదరణను, గమనించి గర్హించేవారు. పురందరదాసులరాకచే మఠంలోని వారి ద్వేషం ఇనుమడించింది. భజనగోష్ఠిలో

4. అదే, పుట. 49



స్వామివారితోపాటు పురందర, కనకదాసులు చేరడం సహింపరాని ద్వేషానికి కారణమైంది. కనకదాసును ఎలాగైనా మఠంనుండి పంపించివేయాలని కుట్రపన్నేవారు. ఈ విషయం వ్యాసరాయల వారికి తెలిసినా, తెలియనివారిలా ఉండేవారు. కనకదాసు అపరోక్షజ్ఞానులని నిదర్శన పూర్వకంగా శిష్యులకు తెలియజేస్తుండేవారు.

ఒకరోజు విజయనగరంలో మధ్యాహ్న కాలంలో విద్వద్గోష్ఠి జరుగుతుండగా పురందరదాసునీ, కనకదాసునీ చెంత కూర్చోబెట్టుకొన్నారు. మోక్షానికి అధికారులెవ్వరన్న అంశంమీద పండితులు వాద ప్రతివాదాలు చేస్తున్నారు. మోక్షంపొందే అర్హత కలిగి ఉన్నట్టుగా చెప్పే ధైర్యం ఎవరికీ లేక ఊరకుండి పోయారు. వ్యాసరాయలు కనకదాసుని ముఖం చూడగా, ఆయన నేను వెళ్తేవెళ్తాను' అని సమాధానం ఇచ్చారు. కనకదాసు మాటల్ని విని తక్కిన శిష్యులు ఆగ్రహించారు. గురువులైన వ్యాసరాయలు, ఉత్తమకులజులైన తమముందు ఇలా అనడం 'కురుబకనకు'నికి ఎంతధైర్యం అని కనకదాసును నిందించడం మొదలెట్టారు. అప్పుడు వ్యాసరాయలు కనకదాసుతో నీమాటల్లోని ఆంతర్యమేమిటో, అర్థమేమిటో విడమరచి చెప్పమన్నారు.

కనకదాసు 'నేను', 'నాది' అనే అహంకారం ఏమనుష్యునిలో ఉండదో అతను మోక్షం పొందడానికి అర్హుడని తన మాటకు అర్థం' అని చెప్పగా, తక్కిన శిష్యులు సిగ్గుపడి తలవంచుకొన్నారు. ఈ నిదర్శనంవల్ల కనకదాసు మాట్లాడే ప్రతిపదంలోనూ గూఢార్థం అణగి ఉంటుందని వ్యాసరాయలు శిష్యులకు తెలియజేశారు[5].

శ్రీ కనకదాసులవారికి శ్రీనివాసుడు కలలో కన్పించి తిరుమలకు రమ్మని చెప్పాడన్న వృత్తాంతం ఒకటుంది. 'శ్రీ కనకదాసుకు శ్రీహరి కనిపించి

5. అదే, పుట. 50

తిరుమలలో తనవివాహానికి రమ్మని ఆహ్వానిస్తే వీరు వెళ్ళారట. ఏడుకొండలూ ఎక్కుతూ వస్తున్న ఈ దాసులను సాదరంగా ఆహ్వానించుమని దేవాలయ అధికారులకు వారి స్వప్నంలో శ్రీనివాసుడు ఆదేశించాడు. వారంతా పూర్ణకుంభంతో బయలుదేరారు. వీరినేకలిసి కనకదాసు ఎక్కడ? అని ప్రశ్నించారు. అప్పుడు వీరు 'ముందు వచ్చేవారికి వెనుక, వెనుకవచ్చేవారికి ముందున్నాడని' సమాధానం ఇచ్చారు. వారికి అర్థంకాక వెళ్ళిపోయారు. జనం రద్దీవల్ల దాసులకు దైవదర్శనం కాలేదు. ఆ రాత్రి ఆకలితో బాధపడుతున్న దాసులకు స్వామి మరో రూపంతో వచ్చి ఆకలితీర్చి కప్పుకునేందుకు చక్కటి జలతారు వస్త్రాన్ని ఇచ్చివెళ్ళాడు. మరునాడుదయాన్నే అధికారులు స్వామివస్త్రాన్ని దొంగలించినవాడుగా ఇతడిని పట్టుకొని కొట్టించారు. ఇతడికి తగిలిన దెబ్బలు స్వామి విగ్రహానికి వాతల రూపంలో కనిపించగా కనకదాసు మహా మహిమాన్వితుడుగా గుర్తించారట'[6]

ఇలా కనకదాసులవారు దాసశ్రేష్ఠులై 'భగవద్భక్తులై' వ్యాసరాయలవారి అనుమతినిపొంది అనేక దివ్యక్షేత్రాలను సందర్శించడానికి బయల్దేరారు. తంబూరపట్టుకొని, హరిభజనగావిస్తూ బేలూరు, శ్రీరంగపట్టణం, మేలుకోట, సోసలె, మళూరు, ఉడుపి, హంపి, తిరుపతి క్షేత్రాలను దర్శించారు. సద్గతినిపొందడానికి తీర్థయాత్రలు చేయడం సులభోపాయమని ఉద్బోధించారు. ఈక్షేత్రాలలో కొంతకాలం ఉండి, ఆయా క్షేత్ర దేవతలను పూజిస్తూ కృతార్థులయ్యారు కనకదాసులవారు.

6. ప్రముఖ కన్నడాంధ్ర వాగ్గేయకారుల సంకీర్తనలలో తిరుమల శ్రీనివాసుని ప్రశంస- ఒక పరిశీలన, పుట 37, డా॥ మాళగి వ్యాసరాజ్.

# భక్తకనకదాసు కీర్తనలు

కన్నడహరిదాసులలో కనకదాసు విభిన్నంగా, విశిష్టంగా కన్పిస్తారు. ఆయన సంకీర్తనకారుడేకాదు స్వయంగా కవికూడ. అందువల్ల ఆయనలో ద్విముఖమైన సాహిత్యాన్ని అవలోకిస్తాము. ఒకటి ఆయనలోని భక్తిసాహిత్యం-కీర్తనసాహిత్యం; రెండవది కావ్యరచన ఒకటివ్యక్తినిష్ఠం ; మరొకటి వస్తునిష్ఠం.

పురందరదాసులాగా కనకదాసు అనేక కీర్తనలను రచింపక పోయినా, ఈయన కీర్తనల సత్త్వం ఏ హరిదాసకీర్తనలకూ తీసిపోదు. కనకదాసు ముఖ్యంగా హరిభక్తి ప్రతిపాదకులు. అందువల్లనే ఆయన కీర్తనలో అధికభాగం సర్వసమర్పణ భావాన్ని కలిగి ఉంది.

కనకదాసులోని 'దేశి' శైలి, లోకానుభవం, ఆయనను ఉత్తమ కీర్తనకారుడుగా నిలబెట్టాయి. లోకనీతి, సామాజిక స్పృహ, ఆత్మనివేదన ఆయన కీర్తనలలో దర్శనమిస్తాయి.

పురందరదాసులాగానే కనకదాసులవారుకూడ 'ఎల్లరూమాడువుదు హొట్టెగాగి గేణుబట్టిగాగి' అన్నపల్లవితో కూడిన కీర్తనను రచించారు.

**'ఏవరేమి చేసినా పొట్టకోసమే జానెడు బట్టకోసమే**
**పిడికెడు ముద్దకోసమే ॥ప॥**
**తాళదండియ శ్రుతిమేళ తంబూర చేబూని**
**వేశ్యవలె నర్తించుట పొట్టకోసం జానెడు బట్టకోసం**
**సన్యాసి జంగమబోగి జెట్టి మొండి బైరాగి**
**నానావేషము లన్నియును పొట్టకోసం జానెడు బట్టకోసం**
**వంగిడొంకలోన అణగి కట్టెరాయి పట్టుకొని**
**దొంగతనము చేయుట పొట్టకోసం జానెడుబట్టకోసం'**

ఇలా సమాజంలోని వివిధ వర్గాల, వివిధరకాల వృత్తులూ కేవలం పొట్టకోసమన్న సత్యాన్ని ఈ కీర్తనలో తెలియజేస్తారు. కీర్తన చివర్లో

**'ఉన్నత కాగినెలె ఆదికేశవుని ధ్యానము**
**మనసార చేయుట భక్తికోసం - పరమ ముక్తికోసం' అంటారు.**

**'కులకులమని కొట్టుకోకండి మీ కులపు మూలమేమైనను తెలుసా ॥ప॥**
**పుట్టని జన్మలులేవు మెట్టని నేలలులేవు**
**వండి తినని పదార్థములు లేవు**
**గుట్టు కన్పింప వచ్చె పెద్దదేమిటి, చిన్నదేమిటి**
**నేరుగా సర్వజ్ఞుని స్మరింపుమో మనుజుడా ॥1॥**

**జలమె సకలకులములకు తల్లికాదా**
**జలము కులమేమైనా తెలియునా**
**బుద్బుద ప్రాయమట్లు స్థిరముకాదీదేహం**
**మూలము నెరిగి నీవేమి కంటివి మనుజుడా ॥2॥**

**హరియే సర్వోత్తముడు హరియే సర్వేశ్వరుడు**
**అంతయు హరిమయమని తెలిసి**
**సిరికాగినెలె యాదికేశవరాయని**
**చరణకమలముల కీర్తింపుమో కులజుడా ॥3॥**

అంటూ భగవంతుని సృష్టిలో, దృష్టిలో మేలుకీడులు లేవు, తారతమ్యాలు లేవు. కులంపేరుతో మానవులు కొట్టుకోకండి అని హితవు పలికారు కనకదాసు.

అలాగే హరిభక్తుడయినవాడే సత్కుల సంజాతు డనడాన్ని

**'కులకులకులవెన్నుతిహరో ।**
**కులవావుదు సత్య సుజనీరిగె' ॥ప॥ - అన్న**

కీర్తనలో 'కులమేది సత్యసుఖమున్న మనుజులకు' అని ఆశ్చర్యంగా అడుగుతూ బురదలోపుట్టిన తామరను తెచ్చి పద్మనాభునికి సమర్పించడం లేదా ?



ఆవుపొదుగు మాంసంలో ఉత్పత్తియైన క్షీరాన్ని భూసురులు త్రాగడంలేదా ? అని అంటూ నారాయణుడే కులంవాడు ? ఆత్మది ఏకులం ? జీవం ఏకులం? 'తత్త్వేంద్రియాల కులం చెప్పండయ్యా అని ప్రశ్నించి జనులనోళ్ళను మూయించారు. కేవలం పుట్టుకవల్ల కులాన్ని ఎంచకూడదని, ఆయావ్యక్తుల సంస్కార యోగ్యతలవల్ల మాత్రమే అతని కులం తెలుస్తుందని అంటారు కనకదాసు.

వైదికమతంలోని నియమాలను, ఆచరణలను పురందరదాసులాగానే కనకదాసులవారు కూడ నిరాకరిస్తారు. అయితే పూర్తిగా నిరాకరించారనడానికి వీలులేదు. కొన్ని కీర్తనలలో ఈ క్రింది నియమాల నన్నిటినీ పాలించడానికి సాధ్యంకాలేదని వాపోయారు.

**'నేమములేని హోమమింకెందులకు రామ**
**నామములేని మంత్ర మింకెందులకు ? ॥ప॥**

**నీట మునుగనేల ? నారి విడువనేల ।**
**వారమున కొక్క ఉపవాసమేల ? ॥**
**నారసింహుని దివ్యనామము తలచిన ।**
**ఘోరపాతకమెల్ల తొలగిపోవును గద ॥ ॥1॥**

**అంబర తాంబూలముల విడువనేల ? ।**
**దంభముతో నీవుండట ఏల ? ॥**
**అంబుజనాభుని మనసున దలచిన ।**
**ఇంబున్నదయ్య వైకుంఠపురమందు ॥'**

ఇలా బాహ్యమైన ఆచరణలకు ప్రాముఖ్యం ఇచ్చి నడచుకొనే వాళ్ళకు వాటి అవసరం లేదని, శ్రీహరి నామస్మరణ వల్ల మాత్రమే పాపాలు తొలగిపోతాయని అంటారు కనకదాసు. ఈ కీర్తనలో ఆ నాటి సమాజపు స్వరూపస్వభావాలు, వర్తనలగురించి కనకదాసులవారికున్న కోపతాపాలు వ్యక్త మవుతాయి.

**'దాసనాగో భవపాశనీగో వి**
**శేష నా గో ॥ప॥'**

అన్న కీర్తనలో కూడ జప, తపో, హోమ, నియమాలను ఎన్నిమార్లు చేస్తే ఫలమేమిటి ? వాసుదేవుడనే లోనున్న హంసనుచేరి, మోసపోక ముక్తుడవుకమ్ము, శక్తుడవుకమ్ము అంటారు.

**'నాలిగెయ కూరిగెమాడి బిత్తిరయ్య**
**హృదయ హొలవను మాడి తనువనేగిలుమాడి**
**పన్విరా ఎంబ ఎరడెత్త హొడి**
**జ్ఞాన వెంబొ మిణియ కణ్ణిహగ్గవమాడి**
**మనవెంబ ధ్యానవ నోడి బిత్తిరయ్య'**

భూమి పరిపక్వమై మంచి ఫలితాన్ని ఇచ్చేట్టుగా దేహాన్ని దండించడం వల్ల, మంచి మనస్సువల్ల హరిస్మరణ జీవితానికి సుఖాన్నిస్తుందంటారు కనకదాసులు. ఈ కీర్తనలో మనస్సును ధాన్యానికి పోల్చడం ఉచితంగా ఉంది.

కనకదాసు రచించిన దాదాపు 200 కీర్తనలలో ఇరవై వరకు తిరుమల శ్రీనివాసునికి సంబంధించినవిగా ఉన్నాయి. ఈ కీర్తినల్లో పరమాత్మతత్త్వం గోచరిస్తుంది. శ్రీనివాసుని స్తుతించిన ఈ గేయం చూడండి.

**'ఏనెందు కొండాడి స్తుతిసువెనోదేవ ।**
**నానేను బల్లె నిమ్మ మహిమెగళ మాధవ ॥ప॥[7]**

అన్న కీర్తనలో స్వామిని పరమాత్ముడిగా, పరమ జ్యోతిగా పేర్కొని జీవాత్మపరమాత్మల భేదాన్ని తెలిపే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. హరి ముకుందుడవు నీవు, నరజన్మపురుగును నేను ; పరమాత్ముడవు నీవు పామరుడ నేను; అని అంటూ

7. శ్రీ శ్రీనివాసన హాడుగళు, సం. 2, పుట. 88



**'తిరుపతి వాసుడ శ్రీవేంకటేశ నీ ।**
**చరణసేవకుల సేవకుడను నేను ॥'**

అని స్వామిని స్తుతించారు.

అలాగే **'తనునిన్నదు జీవననిన్నదు రంగ ।**
**అనుదినదలి బాహోసుఖదుఃఖ నిన్నదయ్యా ॥ప॥[8]**

తన దేహం, జీవనం అంతా శ్రీనివాసునిదే అంటూ తాను అస్వతంత్రుడినని చెప్పుకొన్నారు. మాయాపాశవు వలలో చిక్కుకొన్నట్టి శరీరం, పంచేంద్రియాలు నీవి ; నీవుకాక నరులు స్వతంత్రులా ? అంటారు కనకదాసు.

భగవంతుని ప్రాణేశ్వరునిగా ఎంచుకొనే మహాభావం మధురభక్తి. భక్తుడు తనను ప్రేయసిగా భావించుకోవడం మధురభక్తిలోని వైశిష్ట్యం. కన్నడ కీర్తనలలో మధురభక్తి కన్పించదు. భగవంతుడొకడే పురుషుడనీ, తక్కిన జీవరాశి స్త్రీ స్వరూపమని మధురభక్తి చెప్తుంది. అయితే ద్వైత సిద్ధాంతం భగవంతుడు ఈశుడనీ భక్తుడు దాసుడనీ తెలియజేస్తుంది. కనకదాసులవారి ఒక కీర్తనలో పరోక్షంగా మధురభక్తి కన్పిస్తుంది.

**'రమణికేళెలె మోహన శుభకాయన**
**అమర వందిత రవిశతకోటి తేజన**
**విమల చరిత్రది మెరెవ శ్రీకృష్ణన**
**కమల వదన నీ తోరె'**

మోహన శుభకాయుడైన శ్రీకృష్ణుణ్ణి తనకు చూపని తనను గోపికగా సంభావించుకొని లక్ష్మీదేవిని అర్థించారు శ్రీ కనకదాసు. 'శ్రీ కనకదాసులు ఇంకా దాస దీక్ష స్వీకరించని సమయంలో విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావంలో దీనిని రచించి ఉండవచ్చు'[9]

8. అదే – పుట. 103
9. ప్రముఖ కన్నడాంధ్ర వాగ్గేయకారుల సంకీర్తనలలో తిరుమల శ్రీనివాసుని ప్రశంస – ఒక పరిశీలన, పుట, 212

అలాగే కక్ష్యాతారతమ్యాన్నికూడ పరోక్షంగా ప్రస్తావించారు కనకదాసు.

**'సకలైశ్వర్యద శిరిదేవి నిన్నరసి బహు**
**ముకుతియిందలి లోక పుట్టిసువ**
**శకుత నిన్నహిరియ మగను ప్రాణిగళమో**
**హకది మరళుమాళ్పకిరియ మగనిగనినగిహను'**

అని ముందుగా స్వామివారు, పిదప అతనిభార్య లక్ష్మీదేవి, ఆ పిదప అతని కుమారుడైన సృష్టికర్త బ్రహ్మ – ఇలా కక్ష్యాతారతమ్యాన్ని తెలిపారు కనకదాసు.

**'శిరియ మదవె ముకుంద – నిన్న ।**
**చరణసేవకన బిన్నహ పరాకెలొ దేవ ॥**

అన్న కీర్తనలో స్వామి చరణసేవకుడనైన తనపై పరా కెందుకని కూడ వాపోవడం ఈ కీర్తనలో కన్పిస్తుంది.

'నీన్యాకో నిన్నహంగ్యాకో నిన్ననామద బలవొందిద్దరె సాకో ॥ప॥' (నీవేలరా నీదయ ఏలరా, నీ నామ బలమొక్కటున్నచో చాలు)

అన్న కీర్తనలో (హంగు) దాక్షిణ్యం, లేదా దయ అన్నపదం అర్థవంతంగా ఉంది. ఏనుగు మొసలికి చిక్కి మొరపెట్టుకుంటున్నప్పుడు హరినామమే రక్షించింది. ప్రహ్లాదుని తండ్రి బాధించుచుండగా నరహరి అన్న నామమె రక్షించింది. ద్రౌపది వస్త్రాన్ని లాగుతుండగా కృష్ణకృష్ణ అన్న నామమె ఆమెను రక్షించింది. ఇలా నీ నామానికి సరి అయినది ఈ జగత్తులో ఏదీ లేదు అని అనేక ఉదాహరణలను కనకదాసు ఇచ్చారు.

కనకదాసులవారి కీర్తనలో సంగ్రహరామాయణం చెప్పబడింది. 'మాదయ్య నిన్నదాసర ..... కృపగళను' అన్న కీర్తనలో రావణకుంభకర్ణాదులను సంహరించి, విభీషణునకు పట్టం కట్టిన శ్రీరాముణ్ణి శరణువేడుతున్నట్టు



చెప్పబడింది. ఇందులో కనకదాసు సీతాపహరణంనుండి విభీషణుని పట్టాభిషేకంవరకు ఉన్న ఘట్టాలను ప్రస్తావించారు.

**'సీతెయను కద్దు ఒయ్దవన కొల్లువభరది**
**భూతళద కపిగళను కూడికొండు**
**సేతువెయకట్టి శరనిధిదాటి బరలాగ**
**చేతనద రావణేశ్వర కుంభకర్ణస**
**త్వాతిశయ రక్కసర ఇరి దొరగిసి**
**మాతులాలిసి విభీషణగె పట్టవనిత్త !**
**దాత రఘునాథనె శరణెంబెను'**[10]

అలాగే భాగవతంలోని శ్రీకృష్ణుని లీలలను ఈ కీర్తనలో పొందుపరిచారు

**'వికటముగ పూతనని చంపి**
**శకటాసురుని పాదముతో త్రొక్కి**
**దికుటధికుట అనుచు**
**అక్కరతొ నర్తించుచు నేగె నింటికి**

**గోవర్ధన పర్వతము నెత్తి**
**గోవుల కాచె, తన**
**మామ కంసుని చంపి**
**ఆతనితొ గూడి పాడుచునేగె నింటికి'**

రామాయణ, భారత, భాగవతాలు మూడింటిని నాలుగు పాదాలలో సూచించారు కనకదాసు చూడండి.

**'శిలను సతిగజేసి శుద్ధి చేసినపాదము**
**మెచ్చి పార్థుని రథమునడిపిన పాదము**

10. శ్రీ శ్రీనివాసన హడుగళు, సం. 2, పుట. 83

**కలి సుయోధనుని ఓలగమునుండి కూల్చినపాదము**
**మథించి కాళింగుని పడగ త్రొక్కినపాదమును'**

మొదటి పాదం రామాయణానికి, రెండు మూడు పాదాలు మహాభారతానికి, నాలుగోపాదం భాగవతానికి సంబంధించింది.

కనకదాసు ప్రయోగించిన రూపకం, ఉపమాలంకారాలకు కొదువలేదు.

**'స్తనములు కలశములు దేహలావణ్యరసమే తైలము**
**వనజాక్షుల భుజములే దండములు**
**ఘనమైన కాంతిగల మాణిక్యాంగుళీయకముల**
**వ్రేళులతో దీపములు శోభించినవి'**

ఆ సుందరీమణుల స్తనాలే తైలపుకలశాలు, దేహ లావణ్య రసమే తైలం, భుజాలే దండయై ఉండగా, వారి అమోఘకాంతి మాణిక్యపుటుంగరంతో గూడిన దీపాలు శోభించాయి. అద్భుతమైన రూపకం ఇది.

అలాగే మరో రూపకాలంకారం చూడండి.

**'బాలిక గొంతు బంగారు రోలు సుస్వరమె చెరకుగణుపు**
**కురుల ఒంపుల కత్తెరలు కుంభములు**
**పాలునిండిన కుచములు నిడుపాటి**
**కంటి ఆలి చిప్పలు శోభించినవి.**

బాలికల మెడలే రోళ్ళు, మధురధ్వనే చెరకుగని, వంకర వెంట్రుకలే వినోదపుకత్తెర, పాలునిండిన స్తనాలే కుంభాలు, విశాలమైన కంటి ఆలిచిప్పలు శోభించాయి.

'రతీదేవికి స్వర్ణకేతకీపుష్పములవలె గర్భచిహ్నములు కనిపించె దేహమున' ఆ లతాంగి దంతములు మొల్లల చిరునవ్వువలె కనులను రంజింపజేసె' మొదలైన ఉపమాలంకారాలను ప్రయోగించి కావ్యానికి శోభను చేకూర్చారు.



'నలచరిత్రె'లో సర్పం కరచిన నలుడిరూపాన్ని సహజమైన సరళభాషలో కనకదాసు వర్ణించారు. చూడండి.

**'పెద్దపొట్ట, గూనివీపు**
**అద్ద దిద్దమగు మొగము ముడివడిన ముక్కు**
**పెద్ద కాలుసేతులు రాలిన రోమమీసములు**
**మందమైన దేహము బొంగురుగొంతు**
**కుబ్జరూపము బవిరిగడ్డము'**
**మొద్దువలె కురూపిగా నృపతియుండె విషముతోకూడి'**

స్వభావోక్తి అలంకారానికి చక్కని ఉదాహరణ యిది.

పోతే కనకదాసు రచనలలో 'ముండిగెలు' ప్రాధాన్యం వహిస్తాయి. వేదకాలంనుంచీ ఇలాంటి రచనలకు ఒక సంప్రదాయం గుర్తించబడింది. అక్కడ ఇలాంటి రచనల్ని 'ప్రవహ్లిత' అని పిలుస్తారు. బౌద్ధులలో దీనికి సమానంగా 'సంధాభాషా' అన్న పేరుంది. ఇలా గోప్యంగా, గూఢంగా, రహస్యంగా చెప్పేవిధానానికి 'బెడగు', పొడుపుకథ, 'ముండిగె' భారూడ, ప్రహేళిక మొదలైన పేర్లున్నాయి. వచనకారులు వీటిని 'బెడగిన వచనాలు' అని పిలిస్తే హరిదాసులలో 'ముండిగె' అన్నపేరు వ్యవహారంలో ఉంది[11].

జానపద సాహిత్యంలోని పొడుపుకథలలాగా 'ముండిగె'లు బుద్ధి శక్తి ప్రదర్శనకు నిదర్శనకు నిదర్శనంగా కన్పిస్తాయి. మహాభారతంలోని యక్షప్రశ్నలు, గ్రీకుపురాణంలోని స్ఫింక్స్‌రాక్షసి ఒడ్డిన సమస్యలు, బేతాళ పంచవింశతిలోని భేతాళుడి ప్రశ్నలు ఈ కోవలోనికి వస్తాయి. అల్లమప్రభు బెడగిన వచనాలు కన్నడ సాహిత్యంలో ప్రముఖస్థానాన్ని పొందాయి. ఇవి దాసశ్రేష్ఠులకు స్ఫూర్తినిచ్చిఉంటాయి.

---

11. కనకదాస, పుట 68, టి.ఎస్. నాగరత్న

దాసవరేణ్యులలో ఇలాంటి ముండిగెలను రచించిన వాళ్ళలో పేర్కొనదగ్గవారు కనకదాసు, పురందరదాసు, ప్రసన్న వెంకటదాసు, గోపాలదాసు. వీళ్ళందరిలో కనకదాసు అధికసంఖ్యలో ముండిగెలు రచించారు. 'ఇంతవరకూ అర్థంచెప్పలేని, తత్త్వ భూయిష్ఠమైన, అన్యార్థ ప్రధానమైన ముండిగెలూ చేరి కనకదాసులవారి ముండిగెలు సంఖ్యలో దాదాపు 10-15 ఉండవచ్చు. వాటిలో కొన్ని రచనలను మాత్రం కొంతమంది పండితులు వివరించి చెప్పారు'[12]

పొడుపుకథలో సవాలుచేసే గుణం ఉంటుంది దాన్ని విప్పిచెప్పితే సమాధానం లభిస్తుంది. ఇది మెదడుకు మేతగా పనిచేస్తుంది. ముండిగెలో కూడ ఇదే తత్త్వం ఉంది. చూడండి.

**'మరనుంగువ పక్షి మనెయొళగె బందిదె ఇదర**
**కురుహె పేళి కుళిత్తిద్ద జనరు. ॥ప॥**
**.............................................**
**............................................'**

**అనువాదం :**

**'చెట్టును మ్రింగే పక్షి ఇంటిలోనికి జొరబడినది దీని**
**గుర్తు చెప్పుడు కూర్చున్న జనులు ॥ప॥**
**ఒంటికొమ్ముపక్షి ఒడలందు కరుణ లేదు**
**గొంతులు మూడున్నవి ముక్కులేదు**
**కుంటిమనిషి లాగ కూర్చున్నది ఇంటిలోన**
**అష్టాదశల అన్నాన్ని భక్షిస్తుంది.**

12. అదే, పుట. 69



**పలుకుచు తినుచు నడినెత్తిన నోరు**
**కడునాదపు గానము చేయుచున్నది**
**అడవిలోన పుట్టును విడిరెండగును**
**పేదతనమువచ్చిన అతిగా రక్షించును**
**కంజవదనుల హస్తమున నర్తించును**
**ఎంగిలి తినిపించును ముజ్జగములకు**
**రంజించెడి రత్నసింహాసనము మీది**
**కుంజర వరదాది కేశవుడు తా నెరుగును.'**

ఈ ముండిగె (పొడుపుకథ)కు అర్థం లేదా సమాధానం విసరురాయి. ఇక్కడ ఒంటి కొమ్మంటే కొయ్యగూటం. కంజవదనుల చేతులలో నృత్యం చేస్తూ ముల్లోకాలకు ఎంగిలి తినిపించే విసరురాయి బీదలకు ఆధారం. 'భావన కంటె బుద్ధి కసరత్తుకు, కావ్యానికంటే తత్త్వానికే ప్రాధాన్యం ఇచ్చే కనకదాసులవారి ముండిగెలు పండితులకు నేటికీ సవాలుగానే ఉండిపోయాయి'[13]. విసరురాయి వర్ణనను రూపకాలమూలకంగా కనకదాసు వర్ణించారు. 'కుంటిమనిషిలాగ కూర్చున్నది', 'కడునాదపు గానముచేయుచున్నది' ఇలాంటివి జానపదుల కల్పనలకు దగ్గరగా ఉన్నాయి.

ఇలా కనకదాసులవారు రచించిన ముండిగెలు హరిదాస సాహిత్యంలో ప్రత్యేకతను కలిగిఉన్నాయి.



13. కనకదాస, పుట 70.

# భక్తకనకదాసుకీర్తనలు -జానపదధోరణులు

పద్నాలుగో శతాబ్దంలో ప్రారంభమైన దాససాహిత్యం దాసవరేణ్యులు సమాజానికి సమర్పించిన అత్యుత్తమమైన కానుక. శ్రీపాదరాయలతో మొదలయిన ఈ సాహిత్యం 18-19 శతాబ్దాలదాకా విస్తరించుకొంది. వీరితో ఆరంభమైన ఈ సాహిత్యం పురందర, కనకదాసులతో ఉత్కృష్టమైన ప్రక్రియగా వికాసం చెందింది. మౌఖిక సంప్రదాయంలో నిలద్రొక్కుకుని జానపద అంశాలను అధ్యయనం చేయడానికి కూడ ప్రేరణనిచ్చింది. వీరి కీర్తనలు జానపద గేయాలలాగానే కన్పిస్తాయి. దీనికి కారణం వీరి గేయాలు సాధారణ జన సమూహాన్ని ఉద్దేశించే రచింపబడ్డాయి. మధ్వమత తత్త్వాలను సామాన్య జనులకు కీర్తనలద్వారా అందించాలన్న తపన ఈ కీర్తనలలో కన్పిస్తుంది.

కనకదాసులో జానపద విజ్ఞానాంశాలు, అనేకం దర్శనమిస్తాయి. ఏ కవి లేదా సంకీర్తనాచార్యుడైనా సమాజంతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాడు. జానపదత్వం అనేది ప్రతిమనిషిలోనూ దర్శన మిస్తుంది. తనచుట్టు ప్రక్కల ఉన్న సంస్కృతి సంప్రదాయాలను, మూఢవిశ్వాసాలను తన రచనలలో చొప్పించడానికే ప్రయత్నించడం మనం నన్నయకాలం నుంచే చూస్తున్నాము.

జానపదవిజ్ఞానం విశ్వకోశంలాంటిది. అందులో లేని విషయాలంటూ ఏమి లేవు. అలాంటి జానపద అంశాలనే కనకదాసు కూడ గ్రహించి తనకీర్తనలలో పొందుపరిచారు. జానపదగేయాల శైలి, ఆచారవ్యవహారాలు, వస్తుసంస్కృతి, జానపదకళలు, భాష మొదలైనవన్నీ కనకదాసుల వారి కీర్తనలలో కన్పిస్తాయి. పురందరదాసు లాగానే కనకదాసుకూడ సామాజిక అంశాలతోపాటు జానపద అంశాలను కూడ తమ కీర్తనలలో పొందుపరచి భక్తి ప్రచారంతోపాటు ఉపదేశాన్ని కూడ ఇవ్వడం మనం ఆయన కీర్తనలలో గమనిస్తాం. అలాంటి వాటిని కొన్నింటిని మాత్రం పరిశీలిద్దాం.



కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం జానపదుల్లో కన్పిస్తుంది. ఆత్మీయతను ప్రదర్శించడం జానపదులకే చెల్లుననిపిస్తుంది. కనకదాసు రామాయణ వృత్తాంతాన్ని గ్రహించి ఒక కీర్తనలో.

**'ఎన్నకంద హాళ్ళియ హనుమా**
**చెన్నాగ ఇహరె లక్ష్మణదేవరు' ॥ప॥**

**(కనకదాసరహాడుగళు, పుట. 5)**

**అనువాదం :**

**'నా కంద పల్లెహనుమా**
**బాగుగ నున్నార లక్ష్మణదేవులు ॥ప॥**

**ఘృతపంచామృతము లానాడు అడవిదుంప లీనాడు**
**కర్పూర వీద్యము లానాడు మసిబొగ్గునేడు**
**పూలపాన్పు ఆ నాడు గడ్డిపరువునేడు**
**శ్రీపతి రాఘవులు క్షేమముగనున్నార ॥1॥**

**నవవస్త్రము లానాడు నారచీరలు నేడు**
**పూల జడ లానాడు జటలు ఈనాడు**
**జవ్వాజి కస్తూరి అందు విభూతిరేణువు లిందు**
**శ్రీ వర రాఘవులు క్షేమముగ నున్నార ॥2॥**

**కనక రథము లానాడు కాలినడక నేడు**
**ఘనఛత్రము లానాడు సూర్యతాపము నేడు**
**సనకాదిమునులుసేవించు ఆదికేశవ మా**
**హనుమేశ రాఘవులు క్షేమముగ నున్నార' ॥3॥**

అశోకవనంలో ఏకాకిగా కూర్చున్న సీతమ్మకు హనుమంతుడు కన్పించడంతో ఎక్కడాలేని ప్రీతి విశ్వాసాలు పొంగి పొర్లాయి. ఈ స్థితిని కనకదాసుల వారు ఈ కీర్తనలో తెలిపారు. సీతమ్మ తనబంధువుల క్షేమసమాచారాన్ని విచారించడంలో హనుమంతునిపై చూపిన ఆత్మీయత ఈ కీర్తనలో కన్పిస్తుంది. హనుమా । అని సంబోధించడంలోనే ఈ ఆత్మీయత స్పష్ట మవుతుంది. సీతమ్మ మొదలు శ్రీరాముని యోగ క్షేమాలను విచారించక 'లక్ష్మణ దేవులు' బాగున్నారా అని అడగడంలో లక్ష్మణుని మాట వినక పోవడంవల్ల తనకీ దుఃస్థితి ఏర్పడినట్టుగాను, తమ్ముడు తనమాట కాదని సీతమ్మను వదలి పోవడంవల్ల శ్రీరామచంద్రుడు లక్ష్మణునిపై ఎలాంటి చర్యను తీసుకొన్నాడో అన్న విషయాలను తెలుసుకోవాలన్న ఆతురతా వ్యక్తమవుతుంది. తక్కిన చరణాలు శ్రీరాముని క్షేమసమాచారాన్ని అడిగేటట్టుగా ఉన్నాయి. ఇది ఒక స్త్రీ మనస్తత్త్వాన్ని వ్యక్తంచేస్తుంది.

జానపదశైలిలో రమణీయమైన దశావతార చిత్రణను మనముందుంచారు కనకదాసులవారు.

**'దేవి నమ్మద్యావరు బందరు బన్నిరె' ॥ప॥ అన్నకీర్తన**

**అనువాదం :**

**'దేవీ మనదేవులు వచ్చిరి చూడరండీ ॥ప॥**
**ఎరుపు కనుల చేపైమనరంగడు**
**బలియుని సోముని సంహరించినాడు సంహరించి వేదముల**
**బంగారపుటొడలిలో నుంచాడు. ॥మత్స్య॥**

**పెద్దమడువులోన మన రంగడు**
**గుట్టనెత్తుకొని నిల్చున్నాడు । నిల్చొని, సురకరుల**
**పెద్దవారిగ చేశాడు. ॥కూర్మ॥**



**సుందర కాననమున వరాహమై మన రంగడు**
**బంగరు కంటివానిని సంహరించాడు, సంహరించి, భూమిని**
**అజసంభవున కిచ్చాడు ॥వరాహ॥**

**కోపమున సింహమై మన రంగడు**
**పొట్టలోని ప్రేవుల చీల్చాడు । చీల్చి, హారమువేసి**
**బాలునకు వరమిచ్చాడు ॥నరసింహ॥**

**బాలుడివలె మన రంగడు**
**చతురుడై అంబరమును తాకాడు తాకి బలిని**
**పాదములతో పాతాళమునకు తొక్కాడు ॥వామన॥**

**తల్లిమాటవిని సహస్రభుజముల**
**ఆవులచోరుని చంపాడు చంపి భూమిలోని**
**ఆ పనిలోని సురుల కిచ్చాడు ॥భార్గవ॥**

**ఎరుపుకనుల కోతుల జతగూడి**
**వేగమున లంకకు లంఘించాడు । లంఘించి, మన రంగడు**
**ఆడచోరుని చంపాడు. ॥రామ॥**

**నల్లటి నదిలో గోవుల కాయుచు**
**ఉరగపుమడువున దుమికాడు**
**పాము పడగపై ఎగిరెగిరి నర్తించాడు**
**ఎవరెవరి కేమేమో ఇచ్చాడు ॥కృష్ణ॥**

**............................**

**బండవాడై పుండరీకాక్షుడు**
**ఎక్కడెక్కడో తిరిగాడు తిరిగి, త్రిపురుల**
**భార్యలనెల్ల చెరిచాడు. ॥బుద్ధ॥**

**సుందరసతిని అశ్వము చేసి**
**మంచిరౌతు తా నయ్యాడు**
**మంచిరౌతయి మన రంగడు**
**డోలు పొట్టపై తన్నాడు ॥కల్కి॥**

ఈ కీర్తనను పాడుతూ, డోలువాయినస్తూ గంతులు వేసిన కనకదాసులవారు మనకళ్ళముందు ప్రత్యక్షమవుతారు. అచ్చమైన కన్నడ దేశిపదాలను వాడి జానపద శైలిలో సహజంగా పాడిన ఈ కీర్తన కనకదాసులవారి వర్ణనా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

**అలాగే ఒక మేలుకొలుపు :**

**'పూశరన జనకనె శతకోటి తరణి ప్ర**
**కాశ అగణిత కోటి బ్రహ్మాండ నాయకనె ।**
**వాసవ మరాళి పరమేష్ఠి వందిత వెంక**
**టేశ ఒలిదుప్పవడిసయ్య హరియే ॥ప॥[14]**

అన్న చరణాలతో ప్రారంభయ్యే కీర్తనలో తిరుమల వేంకటేశ్వరునికి 'మేలుకొలుపు' ను సమర్పించారు కనకదాసు

**'పుడమిపతి వైకుంఠమనెడి శేషాద్రియందు**
**సంభ్రమమున మెచ్చి భక్తులను పాలింప కాగినెలెయాదికేశవ**
**జగదొడయ తిరువెంకటేశ జగదీశ మేలుకొనుము హరీ'**

(శ్రీ కనకదాసరహాడుగళు, పుట 193-195) ఈ కీర్తన భూపాలరాగం, ఝంపె తాళంలో ఉంది.

14. శ్రీ శ్రీనివాసనహాడుగళు, సం. 2. పుట. 63



జానపదుల్లో 'మంగళం', జయమంగళం, నిత్య శుభమంగళం' పాటలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కనకదాసులవారు కూడ మంగళహారతి పాటల్ని రచించారు. ఈ క్రింది కీర్తన దశావతారాల మంగళహారతి.

**'అంబుజ దళాక్షునకు మంగళం సర్వ**
**జీవరక్షకునకు మంగళం' ॥ప॥**

అన్న కీర్తనలో హరి అవతారాల కన్నిటికి మంగళం పాడారు. చివర్లో

**'పురత్రయ వధువుల గెలిచిన వానికి మంగళం**
**తురగవాహనునకు జయమంగళం ॥**

**వరకాగినెలెయాదికేశవునకు మంగళం ।**
**సిరిహరి కిపుదు శుభమంగళం' ॥**

**(శ్రీకనకదాసర హాడుగళు, పుట 198)**

ప్రాచుర్యంలో ఉన్న జానపదకథల్ని ఆధారంచేసుకొని కావ్యాలను రచించిన దాసశ్రేష్ఠులలో హెళవనకట్టె గిరియమ్మ తర్వాత చెప్పుకోదగ్గవారు కనకదాసులవా రొక్కరు మాత్రమే. కనకదాసులవారి నలచరిత్ర మోహన తరంగిణి లోని కథావస్తువు పురాణేతిహాసాలనుండి స్వీకరింపబడితే రామధాన్య చరితెలోని వస్తువు జానపదులనుండి స్వీకరింపబడింది. అక్కడ కనకదాసులవారు జానపదుల ఆశయాలను ప్రధానంగా వ్యక్తంచేశారు; జానపద వ్యవస్థలోని స్థితిగతుల్ని తమ కావ్యంలో ప్రతిబింబించారు.

సూక్తులు లేదా లోకోక్తులు మంచి చెడులను మార్మికంగా నిరూపిస్తాయి. ప్రజల అనుభవాలలోంచి వ్యక్తమైన అంశాలే ఇందులో చోటుచేసు కొంటాయి. మానవ స్వభావంలోని లోపాలను, దోషాలను ఎత్తిచూపుతాయి. మానవతవిలువలను, వ్యక్తిదౌర్బల్యాలను హృదయానికి హత్తుకొనేలా చేస్తాయి. నాటి సామాజిక

జీవన రీతుల్ని, ఆచరణ విధానాలను వ్యక్తంచేస్తాయి. సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రజల మూఢత్వాన్ని తొలగిస్తాయి. అహంకారాన్ని, అజ్ఞానాన్ని నిర్మూలిస్తాయి.

దాస సాహిత్యంలో ముఖ్యకేంద్ర బిందువు హరి. ప్రకృతిలోని అన్ని వస్తువులో అతని పరివారం. మానవుడు కూడ అందులో ఒకభాగం. మానవత్వపు విలువలతో జీవనం సాగించడం, భగవంతుని అనుగ్రహాన్ని పొందడం అతని జీవనసార్థక్యం. హరిదాససాహిత్యం ఈ ఉద్దేశంతోనే వెలువడింది. భగవంతునకు, భక్తునకు వైయక్తిక సంబంధాన్ని నెలకొల్పడం దాసశ్రేష్ఠులలో కన్పిస్తుంది.

మానవుడు తన్నుతాను తెలుసుకొన్నప్పుడే సంస్కారవంతు డవుతాడు. అలా తెలుసుకోవడానికి, సంస్కార వంతుడు కావడానికి హరిదాసుల కీర్తనలు తోడ్పడుతాయి; ఆ కీర్తనలలో దాగి ఉన్న సూక్తులు మార్గదర్శకంగా ఉంటాయి. ఇవి సుభాషితాలు. జానపదుల నోళ్లలో నలిగి సామెతలలాగ ప్రాచుర్యం పొందాయి. 'అల్పాక్షరాలలో అనల్పభావం' ఈ సామెతల వైశిష్ట్యం. హరిదాసులందరూ తమతమ కీర్తనలలో సూక్తులను ప్రవేశపెట్టారు. ఒక్కొక్క సూక్తి మనిషి తన్ను తాను దిద్దుకోవడానికి ఉపకరిస్తుంది. అలాంటి సూక్తుల్ని కనకదాసుకూడ తన కీర్తనలలోను, కావ్యాలలోను నిక్షిప్తం చేశారు. కొన్నింటిని ఉదాహరిస్తాను.

**1.** **అజ్ఞానులతోడి అధికస్నేహముకంటె**
**సుజ్ఞానులతోడి జగడమే మేలు**
**(అజ్ఞానిగళ కూడ అధికస్నేహక్కింత**
**సుజ్ఞానిగళ కూడ జగళవే లేసు)**

**2.** **ఆయన అనుగ్రహించిన పిదప ఎలాంటి కులమయ్యా**
**(ఆతనొలిదమేలె యాతర కులవయ్యా)**



**3.** **ఎవరు శ్రేయోభిలాషులో నమ్మవద్దు**
**ఎవరికెవరులేరు ఆపదలు కలిగినప్పుడు**
**(ఆరు హితవరు ఎందు నంబబేడ**
**యారిగ్యారిల్ల ఆపత్తు బందొదగిదడె)**

**4.** **ఈ సంపదను నమ్మి పొంగి పోకుము మనసా**
**వాసుదేవుని భజింపుమో మొరటుజీవనమా**
**(ఈ సిరియ నంబి హిగ్గలుబేడ మనవె**
**వాసుదేవనభజిసో ఒరటుజీవనవె)**

**5.** **అందరూ చేసేది పొట్టకోసం, జానెడు బట్టకోసం**
**(ఎల్లారు మాడువుదు హొట్టెగాగి గేణుబట్టెగాగి)**

**6.** **ఎచటనున్నాడో రంగడు అన్న సంశయము వలదు**
**ఎచట భక్తులు పిలుతురో అచట వచ్చి ఉంటాడు**
**(ఎల్లిరువనో రంగ ఎంబ సంశయబేడ**
**ఎల్లి భక్తరు కరెయె అల్లి బందొదగువను)**

**7.** **ఎందరు దేవతల బలమున్న ఫలమేమి**
**వాసుదేవుని బలములేనివాడికి**
**(ఏసుదేవర బలగళిద్దరె ఫలవేను**
**వాసుదేవన బలవిల్లదవగె)**

**8.** **కళ్ళే కోరికలకు కారణం**
**(కణ్ణె కామనబీజె)**

9. కామక్రోధాలనే చెట్లను పెరికి వేయం దయ్యా
(కామక్రోధగళెంబ గిడగళను తరియిరయ్య)

10. చిలుము పట్టిన పాత్రలో ఆమ్లాన్ని కలిపి తినవచ్చుగా ?
(కిలుబిన బట్టలల్లి హుళికలెసి ఉణబహుదె)

11. చెవియే కర్మకు ద్వారం
(కివియే కర్మక్కె ద్వార)

12. కులకులమని కొట్టుకోకండి, మీ
కులపు మూలమేమైననూ తెలుసా ?
(కులకులవెందు హొడెదాడదిరి నిమ్మ
కులద నెలెయనేనాదరు బల్లిరా ?)

13. గురుసేవకంటె నధికము గలదా ?
(గురుసేవెగిందధిక సేవెయుంటె ?)

14. చిత్తశుద్ధిలేనివానికి పరలోకము గలదా ?
(చిత్తశుద్ధియిల్లదవగె పరలోకవుంటె ?)

15. చలిజ్వరమునకు చందనలేపము హితమా ?
(ఛలిజ్వరక్కె చందనద లేప హితవె ?)

16. జన్మసార్ధకములేని వారందరు భాగవతులా ?
(జన్మ సార్థకవిల్ల దవరెల్ల భాగవతరె ?)

17. నీటి బుడగవలె స్థిరము కాదీ దేహము.
(జలదబొబ్బుళియంతె స్థిరవల్లవీదేహ)



18. జపముచేసిననేమి తపము చేసిననేమి
కపటగుణము విపరీతముగ క
(జపవమాడదరేను తపవ మాడిదరేను
కపటగుణ విపరీత కలుషవిద్ధవరు)

19. జలమె సకల కులములకు తల్లికాదా ?
(జలవె సకల కులక్కె తాయల్లవె ?)

20. జ్ఞానములేక నూరుకాలములు బ్రతుకనేల ?
(జ్ఞానవిల్లదె నూరుకాల బదుకల్యాతకె)

21. తాను తినక పరుల కిడక ధనముండి ఫలమేమి ?
(తాను ఉణ్ణదె పరరగిక్కద ధనవిద్యాతకె ?)

22. తల్లి గతించిన పిదప పుట్టినింటి ఆశయా ?
(తాయితీరిదమేలె తీరాసయె ?)

23 తల్లిదండ్రుల నధికముగ నొప్పించిన
వానికి ముక్తి లభించునా ?
(తాయితందెగళ బలునోయిసిద
న్యాయిగె ముకుతియు దొరకితె ?)

24. తీర్థమును బట్టిన వారెల్లరు తిరునామధారులా ?
(తీర్థవను పిడిదవరెల్ల తిరునామధారిగళె ?)

25. దేవుడులేని గుడి పాడుబడ్డ అంగడి.
(దేవరిల్లద గుడియు హాళు బిద్దంగడియు)

26. దానహీనునికంటె హీనుడు గలడా ?
(దాన హీనగిన్నధిక హీననుంటె ?)

'సూత్రదగొంబెయాట' (కొయ్య బొమ్మలాట) జానపద ప్రదర్శనకళ. ఈ బొమ్మలాటను సూక్ష్మంగా తనకీర్తనలో

**'బొంబెయాటవ నాడిసిదె మహాభారతవ**
**అంబుజ భవాది యాదవరు ఈక్షిసలు.'**

**(శ్రీకనకదాసర కీర్తనెగళు, పుట 89)**

అని తెలియజేస్తారు.

**అనువాదం :**

**'బొమ్మలాట నాడించితివి మహాభారతమును**
**అంబుజభవాది యాదవులు వీక్షింప ॥ప॥**

**కురుభూమియనెడి పరభూమియందు రంజింప**
**మరుగున మాయా మయపు తెరనుపట్టి**
**ధరణీశులన్న నరప్రతిమల నలవడించి**
**నరుని హయరథపు వాగేయ సూత్రముపట్టి ॥1॥**

**చదివెడువాడు నారదుడు వాద్యకారుడు శివుడు**
**బాదరాయణుడే కథాకారుడు**
**మేదిని భారము పోగొట్టు మృత్యుహాస్యరసము**
**వేదనికరములు నివాళు లీయ**

**పదునెనిమిది క్షోణి మార్బలము పదునెనిమిది దినములు ।**
**కదననాట్యపు కేళిక నాడించి'**

..................................
..................................



కనకదాసులవారికి మొత్తం మహాభారతమే ఒక బొమ్మలాటగా కన్పించింది. సూత్రధారు డెవ్వరో కాదు సాక్షాత్ శ్రీహరియే. ప్రేక్షక వర్గం అంబుజభావాది అమరులు. సూత్రపు బొమ్మలాటలో ఉపయోగించే తంత్రాన్ని వాడుకొని కీర్తనను ఒక రూపకంగా చేసి పాడడం బహుశా కనకదాసుల వారికే దక్కుతుంది. సంగీతం, సాహిత్యం, నృత్యాలతో కూడిన సమాహారకళ సూత్రపు బొమ్మలాట. బాదరాయణుడు భాగవతుడు, వాద్యకారుడు శివుడు, వాద్యాలవివరాలు లేకపోయినా ఆ కాలంలో వాద్యాలను ఉపమోగిస్తుండేవారని తెలుస్తుంది.

ఈ కీర్తనలోనే కేళిక అన్న ప్రదర్శన కళ ప్రస్తావించబడింది. కేళిక యక్షగానం లాంటి ఒక జానపదకళ. ఇది పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న కేళిక అనబడే యక్షగానప్రదర్శన కళారూపం. నేటికీ కర్నాటకలోని కోలారుమండలంలో సజీవంగా ఉండడాన్ని గమనించవచ్చు. ఇదికూడ సంగీతం సాహిత్యం, నృత్యంతో కూడుకొన్న సమాహారకళ.

**'దాసనాగో భవపాశనీగో –**
**దాసనాగో విశేషనాగో' ॥ప॥**

**(శ్రీకనకదాసరహాడుగళు, పుట 23)**

అన్నకీర్తనలో 'గారడి' పదాన్ని ప్రయోగించారు. ఇది కూడ కళయే.

**'గారుడియ మతబిట్టు నాదబ్రహ్మన పిడిదు'**
**'దానధర్మవమాడి సుఖియాగు మనవే**
**హీనవృత్తియలి నీ కెడబేడ మనవే ॥ప॥'**

అన్నకీర్తనలో

**'ఏకనాతి ఎల్లమ్మమారి దుర్గి చౌడియర ।**
**అక్కరెయిందలి పూజెమాడలేకె'**

**కొంబుహోతు కురి కోణన బలిగొంబ ।**
**డొంబెదైవగళను భజిసిదరు మనవె ॥**
**(శ్రీకనకదాసరహాడుగళు, పుట 165-166)**

ఈ కీర్తనలో పేర్కొన్న ఎక్కనాతి, ఎల్లమ్మ, మారి, దుర్గి, చౌడి మొదలైనవారు గ్రామదేవతలు. వీరిని క్షుద్రదేవతలుగా పరిగణిస్తారు. వీరిని పూజించడం, ఆబోతుల్ని మేకల్ని బలియివ్వడాలను కనకదాసు ఖండిస్తారు. ఈ దేవతలు మనుష్యులనుండి బలులను అపేక్షిస్తారు. అందువల్ల సర్వోత్తముడైన హరిలాగా వీరు శక్తిమంతమైన దేవతలు కారంటారు. ఇలాంటి దేవతలను పూజించే వ్యక్తులు జంతుబలిని ఇవ్వడంవల్ల నరకాన్ని పొందుతారంటారు.

'మోహనతరంగిణి' కావ్యంలో కనకదాసులవారు తమ సమకాలీన జీవనాన్ని ప్రతిబింబించారు. వసంతోత్సవ ఆచరణలు వసంతోత్సవ సమయంలోని 'రంగినాట'; వివాహ- శోభనపు విధులు; వంటావార్పు వివరాలు- జానపద భక్ష్యాలు-వడ, 'సుఖీనుండె', రొట్టె, 'బుత్తి' ; సంప్రదాయాలు- పద్ధతులు; వ్యవసాయ పద్ధతి ; వేటాదేరీతులు; జూదాల రీతులు; ఇంటిముందరి తులసికోట; భజనపూజాదులు; నగర వీధుల్లో రాశిగాపోసి అమ్మే ముత్యాలు, రత్నాలు, ధాన్యాలు; ఫలపుష్పాదులు మొదలైనవన్నీ ఈ కావ్యంలో సాక్షాత్కరిస్తాయి.

వైదిక ధర్మంలోని నియమాలను, ఆచరణలను కనకదాసు వ్యతిరేకించడం కన్పిస్తుంది. ఉపవాసాలు చేయడం, తీర్థయాత్రలు చేయడం మొదలైన విశ్వాసాలను ఇలా ప్రశ్నిస్తారు.

**'నీర ముణుగలు ఏకె నారియను బిడలేకె ।**
**వారకొందుపవాస విరలేతకె ? ॥**
**నారసింహను దివ్యనామవను నెనెదరె ।**
**ఘోరపాతకవెల్ల తొలగిపోగువుదు ॥'**
**(శ్రీకనకదాసరహడుగళు, పుట 19)**



నీళ్లలో మునగడం ఎందులకు? నారీమణిని విడిచిపెట్టడం ఎందులకు? వారాని కొకసారి ఉపవాసం ఉండడ మెందులకు? నారసింహుని దివ్య నామమును స్మరిస్తే ఘోర పాతకాలన్నీ తొలగిపోతాయికదా అని అంటారు. అలాగే.

**'మీసలాగి మిందు జప - తప హోమ - నేమగళ ।**
**ఏసుబారి మడిదరూ ఫలవేనో - అదు ఫలవేనో ॥**
**వాసుదేవనెంబ ఒళగిద్ద హంసన సేరి ।**
**లేసనుండు మోసగొళదె ముక్తనాగో - నీశక్తనాగో ॥'**
**(శ్రీకనకదాసరహాడుగళు, పుట.22)**

నీట మునిగి జపతప హోమాలను, వ్రతాలను ఎన్ని మార్లు చేస్తే ఫలమేమిటి వాసుదేవుడనే లోనున్న హంసను చేరుము; మోసపోక ముక్తుడ వగుదువు, నీవు శక్తుడ వగుదువు అంటారు.

**'కష్టపట్టరూ ఇల్ల కళవళిసిదరిల్ల ।**
**భ్రష్టమానవ హణెయబరెహ వల్లదె ఇల్ల ॥**
**(శ్రీకనకదాసరహడుగళు, పుట 136.)**

ఇది విధివ్రాతకు సంబంధించిన నమ్మకం. విధివ్రాతను ఎవరూ తుడిచి వేయ లేరన్నది తరతరాలుగా వస్తున్న విశ్వాసం. జానపదుల్లో ఉన్న ఈ విశ్వాసాన్ని కనకదాసు తమ కీర్తనలో ప్రయోగించారు.

ఇలా కనకదాసులవారు తమకీర్తనలలోను, కావ్యాలలోను లెక్కకు మిక్కుటంగా జానపద అంశాలను చొప్పించి, మాధ్వమత తత్త్వాలతోపాటు సామాజిక విలువల్ని మనకు అందించారు.

# భక్తకనకదాసు కావ్యాలు

కనకదాసులవారు అనేక కీర్తనలను రచించడంతోపాటు మోహన తరంగిణి, నలచరిత్ర, హరిభక్తి సారం, రామధాన్య చరిత్ర, నృసింహస్తవం అనే కావ్యాలను కూడ రచించారు. నృసింహస్తవం అలబ్దం. 97 సాంగత్యాల లోగొన్నరచన ఇది అని కన్నడసాహిత్య చరిత్రకారులైన రా. నరసింహాచార్యుల వారివల్ల తెలుస్తుంది. మోహనతరంగిణి సాంగత్యకావ్యం. ఇందులో 42 సంధులూ దాదాపు 2,800 సాంగత్యాలు ఉన్నాయి. దీనికి కృష్ణచరితం అన్న మరోపేరుకూడ ఉంది. స్కాందపురాణం, విష్ణుపురాణం, మహాభారతం, భాగవతం, హరివంశాలలోని కథలు ఈ గ్రంథానికి ఆధారం. ఈ కావ్యంలో మన్మథదహనం, కామోత్పత్తి, శంబరాసుర బాణాసుర వధలు, అనిరుద్ధలీలలు మొదలైన అంశాలు చెప్పబడ్డాయి. ఇది కనకదాసులవారి మొదటి రచన అని పండితుల అభిప్రాయం.

ఈ కావ్యంలో సంప్రదాయబద్ధమైన అష్టాదశవర్ణనలు చొప్పించడానికి ప్రయత్నం జరిగింది. వర్ణనల్లో అక్కడక్కడా సహజత్వం, సుందరమైన కల్పనలు ఉన్నాయి. వర్ణనల్లో చాల వరకు సమకాలీన జీవన ప్రతిబింబాలు కన్పిస్తాయి. మహాకావ్యాలక్షణాలను సంతరించుకొన్న రచనగా ఈ కావ్యం ప్రస్తుతికెక్కింది. స్కాంద పురాణంలోని కౌమారిక కేదార ఖండాలలోని కామదహన వృత్తాంతాన్నీ, భాగవతంలోని ఉషా అనిరుద్ధుల ప్రణయవృత్తాంతాన్నీ, విష్ణుపురాణంలోని రతి–ప్రద్యుమ్నుల వృత్తాంతాన్నీ స్వీకరించి, రసమయ సన్నివేశ వర్ణనలతో కనకదాసు ఈ కావ్యాన్ని సంతరించారు. ఈ అన్నిపురాణాలలోని ఇతివృత్తాన్ని స్వీకరించి, దీన్ని ఒక రసభరిత శృంగార కావ్యంలా రూపొందించారు. ఇందులోని కావ్యవస్తువు సమ్మోహన శృంగారం, దీన్ని చెప్తున్నది తనభార్య అయిన సుజ్ఞాన వధూటికి కావడం వల్ల కవికి ఎలాంటి రహస్యమూ లేకపోయింది.



కావ్యకథా వస్తువును (1) రుక్మిణీకృష్ణుల వృత్తాంతం; కామ దహనకథ (2) రతి–ప్రద్యుమ్నుల వృత్తాంతం; శంబరాసురవధ (3) ఉషా–అనిరుద్ధుల వృత్తాంతం; బాణాసురవధ – ఇలా మూడు విధాలుగా గుర్తించవచ్చు[15]. మొత్తం కావ్యమే ఈ మూడు జంటల ప్రణయకథ. దానితోపాటు మూడు వధలకు సంబంధించిన వృత్తాంతాలు అల్లుకొని వచ్చిన మూడు తరాలకథ ఇది. రుక్మిణీ కృష్ణులు, రతిప్రద్యుమ్నులు, ఉషా అనిరుద్ధులు, శంబరాసుర, బాణాసురులు కావ్యంలోని ప్రముఖపాత్రలు. కావ్యనాయకుడు శ్రీకృష్ణుడు. మొత్తం కావ్యంలో పెత్తనం అంతా శ్రీకృష్ణుడిదే, అంతా ఆయన లీలలే, తక్కిన పాత్రలు ఆయన ఆడించినట్టు ఆడే సూత్రపు బొమ్మలే అన్న భావన వచ్చేట్టుగా కథను కూర్చారు కనకదాసలవారు. బాణాసురుడు ప్రతినాయకుడని చెప్పవచ్చు. ఆయన కూడ అప్రతిమ సాహసవంతుడు, శూరుడు, అనన్య శివభక్తుడు. అందువల్ల శ్రీకృష్ణునివల్ల తన 998 భుజాలను ఖండింపచేసుకొన్న బాణాసురుని శివుడునేరుగా కైలాసానికి తీసుకువెళ్తాడు. దీనివల్ల కావ్యానికి శుభప్రదమైన మలుపు ఏర్పడి ఉషా – అనిరుద్ధుల వివాహంతో కావ్యం ముగుస్తుంది.[16]

బాణాసురుని శివపూజా సమయంలో శివభక్తి కన్పిస్తుంది. కనకదాసుల దృష్టిలో హరిహరులిద్దరికీ అభేదం ఉంది; ఇద్దరూ సమానులు. హరిహరుల ప్రతినిధులన్నట్టుగా కన్పించే ఉషా అనిరుద్ధులవివాహం వరకూ కనకదాసులవారి భాగావతమనస్తత్వం వాళ్ళిద్దరూ ఒకేపీఠంమీద కూర్చుని ఫాలాక్షపుండరీకాక్షలను బిల్వపత్రం, తులసీదళాలచే పూజించడంలోకూడ ఇది స్పష్టమవుతుంది.

'మోహనతరంగిణి'లో కనకదాసు శృంగార వర్ణనలకే ప్రాధాన్యం ఇచ్చారు. శృంగారరసాన్ని నిర్వహించడంలో రతిశాస్త్రాన్ని ఆధారం చేసుకొన్నారు.

15. కనకదాసు, పుట. టి.ఎస్.నాగరత్న

16. అదే

కందర్పజననం మారజననం, జలక్రీడ, రతి, గర్భాధానం, అనిరుద్ధ జననం, ఉషాదేవి శృంగారం, ఉషాస్వప్నం, ఉషా అనిరుద్ధులు ఏకాంతంగా సుఖపడిన రీతులు మొదలైన వృత్తాంతాల్లో సంభోగశృంగారం, ఉషావిరహంలో విప్రలంభ శృంగారం కన్పిస్తుంది.

ఈ కావ్యంలోని శృంగారం ప్రాపంచిక శృంగారం కాదు; ఇది కృష్ణార్పితం; భగవంతునికి సమర్పింపబడింది. ఇక్కడ శీలం, అశ్లీలం అన్న ప్రశ్న ఉదయించదు.[17].

జలక్రీడా సందర్భంలో హాస్యం, కందర్ప జననవృత్తాంతంలో శంబరాసురుడు పదిరోజుల శిశువును ఎత్తుకొని పోయిన సందర్భం, శిశువును కానక రుక్మిణి శోకించడం, మన్మథ దహనానంతరం వచ్చే రతిప్రలాపం మొదలైన సందర్భాల్లో కరుణరసం చిత్రించబడింది. అలాగే సందర్భానుసారంగా రౌద్ర, వీర, భయానక రసాలు చొప్పించబడ్డాయి. శృంగారాది ఎనిమిదిరసాలతోపాటు శాంత రసాన్ని దాని గమ్యస్థానంలో ప్రవేశపెట్టారు. ఇక్కడి అన్ని విషయాలు శుభంతో ముగుస్తాయి. భగవత్సాక్షాత్కారం ఈ కావ్య లక్ష్యం. కృష్ణస్తుతిని, కృష్ణ చరిత్రను సందర్భానుసారంగా చెప్పక వదలిపెట్టలేదు. భాగవతకథలను కనకదాసులు సంగ్రహంగా ఈ కావ్యంలోని 42 సంధులల్లో తెలియజేశారు[18]. ఇందులో దాసులవారి భాగవత మనస్తత్త్వం తెలుస్తుంది కేశవునిపై, నాపై ద్వేషబుద్ధిచూపిన దోషము సంభవించును' అని చెప్పడంలో కనకదాసులో సామరస్యదృష్టిఉన్న క్రాంతికవి గోచరిస్తాడు.

కనకదాసువారి వర్ణనలు 'మోహనతరంగిణి'లో రమ్యంగా ఉన్నాయి. సూర్యోదయ, సూర్యాస్తమయ, నదీ, సాగర, వేట మృగయా వినోదం మొదలైన

17. మోహనతరంగిణి, పుట 76, సం. జి.జి. మంజునాథన్.

18. అదే - పుట 82



అష్టాదశవర్ణనలతోపాటు శ్రీకృష్ణుడి రాజధాని ద్వారకాపుర వర్ణన, బాణాసురుని శోణిత పురవర్ణనలు, రతి-ప్రద్యుమ్నులు, ఉషా-అనిరుద్ధుల శృంగారవర్ణనలు, దేశ సంపత్సమృద్ధుల వర్ణన, భోజనోపచారాల వర్ణన, రణరంగం, యుద్ధ వీరుల వర్ణనలు, వసంతోత్సవసమయంలోని 'రంగినాట' (జానపదకళారూపం) కళ్ళకు కట్టినట్టు వర్ణింపబడ్డాయి.

**'కంజబాంధవుడస్తమింప పదమటిపడుచు**
**చైతన్యముడిగి తన**
**మంజులపునోట తాంబూల ముముసినటుల**
**సంజకెంజీయలో తోచె'**

సూర్యాస్తమయ సమయంలో అద్భుతమైన స్వాభావికమైన వర్ణన ఇది. ఇక్కడ కవి శృంగారపు నేపథ్యాన్నే గ్రహించాడు.

శ్రీకృష్ణుని ద్వారకాపురంలోని సామాన్య జనుల రసికతను ఇలా వర్ణించారు.

**'సుందర వారకాంతల, కన్నియల**
**చివురు పాలిండ్లగాంచి నవ్వుచు**
**లేత వ్రేళ్ళ మెట్టికలు తీయుచు చేతికి గాజుల**
**తొడిగించు గాజులవారి పగిది.**

సుందరీమణుల చిగురుస్తనాలను చూచినవ్వుతూ, వాళ్ళ లేత చేతివ్రేళ్ళ మెటికలు తీస్తూ, వాళ్ళ చేతులకు గాజులు తొడిగిస్తున్న గాజుల వాళ్ళు వీధికిరువైపులా ఉన్నారు.

**'తురుగిద కాయిపణ్ణళ సాలవృక్షవ**
**మురిదు దూళి చెల్లి కొళుత**

**సురివ సొండిల నిర్గరెయుత బందుదు**
**బిరుగాళి మదగజదంతె'**

ఈ చరణాల్లో వర్షం, గాలి రభస ఎలా ఉందంటే – పండ్లు, కాయలతో కూడిన వృక్షల వరుసను ధ్వంసంచేస్తూ వస్తున్న మదగజంలాగ ఉంది. ఆ గాలికి పైకి లేచిన దుమ్ము మదగజం తనమీద తానే వేసుకునే మట్టి దుమ్ములాగ ఉంది. వర్షంతెచ్చే పెనుగాలిని రమ్యంగా చిత్రించారు కనకదాసు.

ఉషా అనిరుద్ధులమధ్య చిత్రలేఖ నడిపే దౌత్యం, మన్మథ కృష్ణుల దండయాత్ర, అనిరుద్ధ బాణాసురుల యుద్ధం, రతివిరహం, ఉషాదేవి విరహం, రతి–ప్రద్యుమ్నులు, ఉషా– అనిరుద్ధుల వివాహం, మొదలైన చోట్ల వర్ణనలు కడురమ్యంగాఉన్నాయి. ఇందులోని వర్ణనలు కేవలం వర్ణనల కోసమే వ్రాసినవి కావు. కనకదాసులవారి లోకపరిశీలనా శక్తి, ఇందులో ప్రస్ఫుటమవుతుంది. సమకాలీన చిత్రణనుకూడ మనముందుంచుతుంది.

నలచరిత్ర భామినీషట్పదిలో రచింపబడింది. ఇందులో 9 సంధులు, 480 పద్యాలు ఉన్నాయి. మహాభారతంలో చెప్పబడ్డ నలోపాఖ్యానమే ఈ కావ్యానికి ఆధారం. ఈ కావ్యం చిన్నదైనా సొగసుగాఉంది. రాజయినా, విధికిలోనై అనేక కష్టాలను అనుభవించి, చివరికి శుభంగా పరిణమించే నలునికథ, కనకదాసులవారి చేతిలో రమ్యంగా చిత్రింపబడింది. కథనకౌశలం ఈ కావ్యమాధురిని ఇనుమడింపచేస్తుంది.

నలచరిత్ర కావ్యం వరపుర చెన్నిగ రాయునకు అంకితం. నలదమయంతుల పరిశుద్ధమైన ప్రేమగాధ ఇది. హంసదౌత్యంతో మొదలైన నలదమయంతుల ప్రణయం పరిణయంతో ముగిసి మధ్యలో సంభవించిన వారి విరహతాప పునర్మిలినంతో ముగుస్తుంది. స్త్రీపురుషుల ఆదర్శ జీవన



చిత్రణ ఇందులో ఉంది. హంసదౌత్యం వల్ల వలచి వివాహమైన దంపతులు నలదమయంతులు. దేవతలైన ఇంద్రాదులు ఆమెను అభిలషించినా, వాళ్ళనుకాదని తనను మోహించినవానినే వివాహమైన ధైర్య శాలిని దమయంతి. అలాగే హరిశ్చంద్ర కావ్యంలో హరిశ్చంద్రుడు సత్యానికి సంకేతరూపమయినట్లే నలుడు ప్రేమకు సంకేతంగా నిలుస్తాడు. హంసదౌత్యం వల్ల ప్రేమించి పెళ్ళి చేసుకొన్న వధూవరులు నలదమయంతులు.

నలునికి జూదమంటే ఎక్కడలేని వ్యామోహం లేదా వ్యసనం. ఇది అతని దౌర్బల్యం. దేవేంద్రుడులాంటి దేవతల్ని ధిక్కరించి నలుని వివాహం చేసుకొన్న విషయాన్ని తెలుసుకొన్న కలిపురుషుడు నలుని ఈ దౌర్భల్యాన్ని సదుపయోగం చేసుకొని, నలుడి తమ్ముడు పుష్కరుడితో చేరి అన్నదమ్ములతో జూదమాడించి, నలుని ఓడించి అడవికి పంపాడు. దమయంతి తన ఇద్దరు పిల్లల్ని తండ్రి ఇంటికి పంపించి తానుకూడ భర్తతోపాటు అడవికి వెళ్ళింది. బంగారపు తూగుటయ్యాలలో పూలపాన్పుమీద పడుకొనే దమయంతిని గని నలుడు వ్యథచెందాడు. అడవిలో వస్తుండగా రెండు జగన్మోహన విహంగాలు నలుడు ధరించిన వస్త్రాన్ని ఎత్తుకొని ఆకాశానికెగిరిపోయాయి. దిగంబరుడై సిగ్గుపడుతున్న నలునిగాంచి దమయంతి తాను ధరించిన చీరను సగం చింపి నలుడు కట్టుకోవడానికి ఇచ్చింది. ఆమె దీనస్థితిని చూసి నలుడు దమయంతిని తండ్రి ఇంటికి వెళ్ళి సుఖంగా ఉండమన్నాడు. ఎంతచెప్పినా వినని దమయంతిని అర్ధరాత్రిలో ఒంటరిగా విడిచివెళ్ళిపోయాడు. ఇలా అడవిలో వెళ్తుండగా కార్చిచ్చుమధ్య అసహాయుడైన కర్కోటకుణ్ణిరక్షించాడు, అది అతని చేతికి కాటువేసింది, దేహం విరూపమైంది.

దమయంతి చేదిదేశాన్ని, నలుడు అయోధ్యాను ప్రవేశిస్తారు నలుడు ఋతుపర్ణుడనే రాజుచెంత బాహుకుడనే పేర్తో సారథిగా ఉంటాడు. దమయంతి

తండ్రి చెంతకు వెళ్తుంది. చాకచక్యంగా నలుడున్న స్థలాన్ని తెలుసుకొని 'దమయంతికి ద్వితీయ స్వయంవరం' అన్న సంగతిని అతని చెవికి చేరవేస్తుంది. ఋతుపర్ణుని అపేక్షానుసారం బాహుకుడు వాయువేగంతో రథంనడిపి, విదర్భనగరానికి పిలుచుకొని వస్తాడు. మార్గమధ్యంలో నలుని సత్త్వపరీక్షగా అతనిని పీడించిన కలిపురుషుడు అతనిని ఆశీర్వదించి వెళ్ళిపోతాడు. దమయంతి మరికొన్ని పరీక్షలు పెట్టి బాహుకుడే నలుడని నిశ్చయించుకొని, తనను రక్షించుమని వేడుకొంటుంది; నలునికి సందేహం తొలగుతుంది. పక్షుల్ని స్మరించగా అవి అతని వస్త్రాన్ని తెచ్చిస్తాయి. దానిని ధరించిన నలుడికి పూర్వ రూపం వస్తుంది. అందరూ సంతోషంతో ఉండగా నలుడు పుష్కరుణ్ణి మళ్ళీ జూదంలో ఓడించి రాజ్యాన్ని గెలుచుకొని ఆలుపిల్లలతో ధర్మబుద్ధితో రాజ్య మేలుతున్నాడు. ఇది సంక్షిప్తంగా నలునికథ అయితే కనకదాసులవారి కథనకౌశలం, వర్ణనా నైపుణ్యం, పాత్రచిత్రణనైపుణ్యం రమణీయంగా ఈకావ్యంలో అభివ్యక్తమవుతాయి. అలాగే దమయంతిని నడిరాత్రిలో విడిచిపెట్టి వెళ్ళిపోయే సమయంలోని నలుని మనోవ్యాకులత, బాహుకుడే నలుడని తెలిసినా ప్రమాణీకరించి చూసేవరకు దమయంతిలోని ఆతురత పాఠకుల మనస్సుల్ని చూరగొంటాయి. తాను కష్టపడినా భార్య సుఖంగా ఉండాలని కోరుకునే నిస్స్వార్థవ్యక్తిగా నలుడు మనకు ఈకావ్యంలో దర్శనమిస్తారు.

**'శ్రీరమణ సరసిజ దళాక్ష ము**
**రారి సచరా చరభరిత దురి**
**తారి నిత్యానంద నిర్జరనికర దాతార**
**వారి జాంబక వరగుణాశ్రయ**
**మారపిత వేదాంతనుత సా**
**కార చెన్నిగరాయ పాలిసు జగకె మంగళవ'**



అనే చరణాలతో ప్రారంభమైన నళచరిత్రే' కావ్యం

**'మేదినియొళీ పుణ్య చరితెయ**
**నాదరిసి బరెదోది కేళువ**
**సాధు సజ్జ నరాదవరిగహుదఖిళ కైవల్య**
**వేద గోచర కృష్ణ వరపుర**
**దాది కేశవనమరవందిత**
**నాది నారాయణను సలహువనఖిళసజ్జనర'**

అన్న చరణాలతో అవసితమవుతుంది. 'ఈ ధరలో ఈ పుణ్య చరిత్రను వ్రాసిన, చదివిన, విన్న సాధుసజ్జనులకు కైవల్య ప్రాప్తి కలుగుతుందని ఫలశ్రుతి చెప్పబడింది.

భారతీయ సాహిత్యచరిత్రలో నలోపాఖ్యానం అతి ప్రాచీనమైంది. భారతీయతను నిలుపుకొన్న అపురూప సంపదగా ఈ కావ్యాన్ని పేర్కొనవచ్చు.

'రామధాన్యచరిత్ర' భామినీషట్పదిలో రచింపబడింది. సుమారు 157 పద్యాలలో రామధాన్యం (రాగులు) అతి చమత్కారంగా చెప్పబడింది. రామాయణం నుండి స్వీకరింపబడిన వస్తువులాగ కన్పించినా ఇదొక స్వతంత్రకల్పన కలిగిన కావ్యం. రాగులు, బియ్యం ఈ రెండింటిలో రాగులే శ్రేష్ఠం అని చెప్పడం ఇందులోని ముఖ్యోద్దేశం. నేటికాలంలో ఉన్నట్టుగానే ఆ కాలంలోని సమాజంలోనూ ధనికులు, దరిద్రుల మధ్యగల అంతరాన్ని అత్యంత అర్థవంతంగా, మార్మికంగా, వ్యంగ్యంగా ఎత్తి చూపడం జరిగింది. రాగి, బియ్యం – ఈ రెండింటిమధ్య జరిగిన సంవాదశైలి, పక్షపాతరహితుడైన శ్రీరామచంద్రుని నడవడి స్పష్టమవుతుంది. ఈ కథకు ఆధారమేమో తెలియకపోయినా, కనకదాసులవారు ఆ కాలంలో ప్రాచుర్యంపొందిన జానపదకథను ఆధారం

చేసుకొని ఈ కావ్యాన్ని రచించిఉండవచ్చునన్న అభిప్రాయంఉంది. సామాజిక స్పృహ ఈ కావ్యంలో రమ్యంగా చెప్పబడింది. ఇది తాత్త్వికంగా గొప్ప భావనాపటుత్వం ఉన్నకావ్యం.

**'శ్రీరమాపతి సింధుశయన ము**
**రారి మునికుల పూజితాంఘ్రి స**
**రోరుహాక్ష సుదర్శనాంకిత దేవ భవదూరా**
**మారపిత కౌసల్యాదేవి కు**
**మార రఘుకుల రామ నృప**
**వర దేవ చన్నిగరాయ పాలిసు సకల సజ్జనరా'**

అన్న చరణాలతో ఈ కావ్యం ప్రారంభమై

**'శరధి శయన ముకుంద చరా**
**చరభరిత నిర్గుణ నిరామయ**
**సుర నరోరగవంద్య వరపురదాదికేశవనా**
**చరణ దంకితవాగి పేళిద**
**పరమ ధాన్యదచరిత సంతత**
**ధరయోళిం తొప్పిహుదు ఆచంద్రార్క పరియంతా'**

అనే చరణాలతో ముగుస్తుంది. తెలుగులో పాల్కురికి సోమన ద్విపదకు కావ్యాగౌరవ స్థానం ఇచ్చినట్లే, కన్నడంలో భీమకవిలాగ కనకదాసుకూడ భామినీషట్పదికి కావ్య గౌరవ స్థానం ఇచ్చారు.

'హరిభక్తిసారం ఒక విధంగా భక్తి భావభరిత శతకగ్రంథం అనవచ్చు. ఇది భామినీషట్పదిలో రచింపబడింది. ఇందులో 110 పద్యాలు ఉన్నాయి. నీతి, భక్తి, వైరాగ్యాల బోధన ఈ గ్రంథం ప్రధానలక్ష్యం కనకదాసులవారి



తత్త్వజ్ఞాన జీవనాదర్శాలు, లోకపునీతులు సులభశైలిలో ప్రతిపాదింపబడ్డాయి. భగవద్భక్తిసార విశ్లేషణ, ఆర్తభావం భావరమ్యత ఈ గ్రంథ వైశిష్ట్యం.

హరి సర్వోత్తముడని

'కమలసంభవ వినుత వాసవ నమిత మంగళ చరిత దురిత క్షమిత రాఘవ విశ్వపూజిత విశ్వ విశ్వమయ' అన్న చరణాల్లో తెలియజేస్తారు, (హ. భ. సా. ప. 4)

'భక్తిసారద చరితెయను హరి భక్తరాలిసువంతె రచిసువె' (భక్తి సారపు చరితను హరిభక్తు రాలించునట్లు రచింతును) అని విన్నవిస్తారు. కేవలం భక్తులకోసమే పాడినట్టుంది. ముక్తికి దారి చూపుతుందంటూ.

**'భక్తిసారపు చరితను హరి**
**భక్తు లాలించునట్లు రచింతు**
**యుక్తితో రచించి, చదివినవారి ఇష్టార్థముసిద్ధించు**
**ముక్తి కిది దారి చూపు హరి**
**భక్తులు దీని నాలింపుడు నిజమతి**
**భక్తిని ప్రేమించు రక్షింపుమమ్ముల ననవరతము'**

**(హరిభక్తిసారం, 18 ప)**

అని అంటారు కనకదాసు.

శ్రీ పురపుటాదికేశవునకు ఈ కృతిని అంకిత మిచ్చారు. కనకదాసు. కృతిలోని ప్రతిపద్యం చివరా 'రక్షింపు మ మ్మనవరతము' అన్న ప్రార్థన కన్పిస్తుంది.

హరిసర్వోత్తము డంటారు కనకదాసు. 'కమల సంభవ వినుత వాసవ నమిత మంగళ చరిత దురిత క్షమిత రాఘవ విశ్వపూజిత విశ్వ విశ్వమయ' అన్న చరణాల్లో ఇది స్పష్టమవుతుంది.

**'ఆకలి గ్రహించి తల్లి తన శిశువుకు**
**అనుగ్రహించి స్తన్యమిచ్చినట్లు నీవు పో**
**షింపకున్న మరెవ్వరు పోషకులై రక్షింతురు'**

**(హ.భ.సా. 23)**

అన్న చరణాలో ఆత్మభావాన్ని చక్కగా చూపించారు.

'సిరి కులసతి సుతడు కమలజుడు పెద్దకోడలు శారద, సహోదరి గిరిజ మరది శంకరుడు......' (హ.భ.సా. 25). అన్నపద్యాలలో బ్రహ్మరుద్రాదులు తక్కిన దేవతలకంటె శ్రీహరి అధికుడని కొనియాడారు.

'గర్భంలో ఉన్నప్పుడు రక్షించిన దెవ్వరు? వెనుక నానా కుయోనుల్లో జన్మించి, ఇప్పుడేదో పుణ్యవిశేషంచేత మనుష్యుడ నయ్యాను ; హరీ ! ఇక నన్ను ఆయాస పెట్టకుము; మళ్ళీ సంసారంలో పడవేయకుము. నే నెత్తిన జన్మ అలాంటిదిలాంటిది కాదు. ఇంద్రియాలు దుర్విషయాల వెంటపడుతున్నాయి. కామాక్రోధాదులు నిండి ఉన్నాయి. సంపాదించిన దుష్కర్మలు రాసులుగా పడి ఉన్నాయి. నీవుకాక మరెవ్వరు ఉద్ధరింతురు హరీ ! చర్మం, రక్తమాంసాలు ఎముకలతో కూడిన దేహమిది. నీవు అనుగ్రహించి, ఇందులో ఉన్నంతవరకే దీనికి గౌరవం. నీవు చేయివిడిచిన వెంటనే దీన్ని మట్టిపాలు చేస్తారు. ఇలాంటిదేహంలో ఎలాంటి పురుషార్థముంటుంది?

స్నానసంధ్యాది సత్కర్మాచరణలు హీన జన్మలను మాత్రం దూరం చేయగలవు. భక్తి సహకృత జ్ఞానమొక్కటే ముక్తికి సోపానం. దానికి నీ అనుగ్రహం కావాలి. అందువల్ల చేయివదలక రక్షింపుము. నీ సూత్రంలో ఈ చరాచర జగత్తంతయు కలదు అలాంటి నిన్ను మరచి నేను నశ్వరమైన సంసారంలో మునిగి యున్నాను నా కర్మం, ఈ సంసారం, ఇవి బీజ-వృక్ష న్యాయంలా



ఉన్నాయి. దీని రహస్యం నీ కొక్కనికే తెలియును. అందువల్ల నీవే రక్షించవలయును. నీ నామస్మరణనే ఎల్లప్పుడూ ఇమ్ము. చివరికి నాకు కావలసింది ఇంతే' ఇలా జీవన అల్పత్వాన్ని చెప్పుకొంటారు. (హరిభక్తిసారం, పద్యాలు 56-69)

'హరి భక్తిసారం' లో శరీరపు నశ్వరతను అతి రమణీయంగా మనసును తాకేట్టుగా వర్ణించారు కనకదాసు.

**'తాళము లేవియు లేని ఊరికి**
**తెలుపులు తొమ్మిది రేయింబవలు**
**మూయక తెరచియుండు జీవాత్మ తానుండి**
**అన్నియువదలి పారవేసి త్వరగ**
**పోవుసమయమున వీరు వారు**
**కాగలరా నీవే రక్షించు మమ్ముల ననవరతము'**

తాళములేని ఊరు ఈ శరీరం. ఈ ఊరికి నిరంతరం తెరచి పెట్టిన వాకిళ్ళు తొమ్మిది (కళ్ళు 2, చెవులు 2, ముక్కు పుటాలు 2, నోరు, గుదద్వారం, ఉపసధ అనేవి నవద్వారాలు). జీవాత్ము దున్నంతవరకు ఈ ఊరిపెత్తనం, నవద్వారాలపని. ఆ జీవమే తొలగి పోయినప్పుడు అన్నీ ఒకదాని నొకటి అనుసరించి స్తబ్ధ మవుతాయి. ఎవరూ సహాయానికి రారు. ఈ తనువనే కోటియమదూతల దాడికి చిక్కి బలికాక ముందే రక్షింపుము.

**'దీనుడ నేను సమస్తలోకమునకు**
**దాతవు నీవు విచారింప మతి**
**హీనుడ నేను మహామహిమ కైవల్యపతివి నీవు**
**నాకేమి తెలియును నేను మూఢుడను సు**

**జ్ఞాన మూరుతివి నీవు నీ స**
**మానులుందురా దేవ'** **(హ. భ. సా. 49)**

అని దైన్యమే మూర్తీభవించునట్లు ఆ హరిని అడుగుతారు కనకదాసు.

**'శ్రీమదుత్సహ దేవనుత శ్రీ**
**రామ నీచరణ సేవకుడ**
**ప్రేమతో సాష్టాంగపడి చేసెద విన్నపము**
**ఈ మహిలో నేటిదనుక మేము సు**
**క్షేమము గలవారము నీపదాబ్జ**
**క్షేమవార్తను తెలిసి రక్షింపుము'** **(హ. భ. సా. 16)**

అని కనకదాసు తమక్షేమాన్ని శ్రీహరికి తెలిపి, అతని యోగక్షేమాలను విచారించడమే కాక, తాము అతనిని భజించే భక్తుల సమూహానికి చెందేవాళ్ళమని పరిచయం చేసుకొన్నారు. తద్వారా శ్రీహరితో ఆత్మీయతను సాధించుకొన్నారు.

**'నూరు కన్యాదానముల బా**
**గీరథీస్నానమును హెచ్చుగా చేతు**
**లార గోవుల ప్రీతితో భూసురుల కిచ్చి**
**ఊరుల నూర గ్రహారముల**
**ధారయిచ్చినటుల ఫలము చేయి**
**చేరును హరిభక్తసార కథవిన్నవారికి'** **(హ. భ. సా. 106)**

ఈ కృతిని ఆదరించి విన్నవాళ్ళకు పైవిధంగా ఫలశ్రుతిని చెప్పారు కనకదాసు.

ఇలా కనకదాసులవారు కీర్తనలనే కాకుండా, కావ్యాలనుకూడ రచించి హరిదాససాహిత్యంలో తమదైన ప్రత్యేకతను నిరూపించుకొన్నారు.